
విలేఖరులు
కావలెను
రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా లకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్ లు, నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ లు, మండలముల వారిగా రిపోర్టర్ లు కావలెను.
(అనుభవము కలవారికి ప్రాధాన్యత కలదు)
పూర్తి వివరములకు : 6281086394 సంప్రదించగలరు
ఎడిటర్
చల్లా శ్రీకాంత్

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM
RNI : APBIL/2023/86665

గుంటూరు | సంపుటి : 01 | సంచిక : 258 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | బుధవారం 23 అక్టోబర్ 2024 | పేజీలు : 8 | వెల :రూ 2-00
GUNTUR | VOL-01 | ISSUE - 258 | CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO | 23 WEDNESDAY SEPTEMBER 2024 | PAGES : 8 | Rs :2-00

# డ్రోన్ టెక్నాలజీ.. భవిష్యత్తులో గేమ్ ఛేంజర్: సీఎం చంద్రబాబు



మంగళగిరి: డ్రోన్ టెక్నాలజీ.. భవిష్యత్తులో గేమ్ ఛేంజర్ కానుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఇటీవల విజయవాడ వరదల్లో డ్రోన్లు వినియోగించి ఆహారం, తాగునీరు అందించామని చెప్పారు.మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో నిర్వహించిన 'అమరావతి డ్రోన్ సమ్మిట్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.ఐటీ, నాలెడ్జ్ ఎకానమీలో భారతీయులు చాలా సమర్థులని సీఎం కొనియాడారు. 1995లో తొలిసారి సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీ రంగం అభివృద్ధికి కృషి చేశానని.. ఆరోజుల్లోనే పీపీపీ పద్ధతిలో హైటెక్ సిటీని నిర్మించామన్నారు. అమెరికా వెళ్లి 15 రోజులపాటు అనేక సంస్థల ప్రతినిధులను కలిసినట్లు గుర్తు చేసుకున్నారు. నివాస అనుకూల నగరాల్లో దేశంలోనే బెస్ట్ సిటీ హైదరాబాద్ అని చెప్పారు. విదేశాల్లో ఉన్న మనదేశ ఐటీ నిపుణుల్లో 30 శాతం తెలుగువారే ఉన్నారని చెప్పారు."ఇప్పుడు నిజమైన సంపద డేటా. భవిష్యత్తులో దేశానికైనా, కంపెనీకైనా అదే కీలకం. డేటాకు ఏఐను అనుసంధానిస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. ఇటీవల విజయవాడ వరదల్లో డ్రోన్లు వినియోగించి ఆహారం, తాగునీరు అందించాం. వ్యవసాయం, మౌలిక వసతుల రంగంలో వాటిది కీలకపాత్ర. నగరాల్లో ట్రాఫిక్ నియంత్రణకు వాడొచ్చు. భవిష్యత్తులో వైద్యరంగంలో పెనుమార్పులు రానున్నాయి. రోగులు ఇంటివద్దే ఉండి చికిత్స తీసుకోవచ్చు. కొన్ని దేశాలు యుద్ధాల్లో డ్రోన్లు వాడుతున్నాయి. మేం మాత్రం అభివృద్ధికి ఉపయోగిస్తాం. శాంతిభద్రతల పరిరక్షణకు వినియోగిస్తాం. పోలీసుశాఖలో విస్తృతంగా ఉపయోగించేందుకు కృషి చేస్తాం. డ్రోన్లతో రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచి వారికి చెక్ పెడతాం" అని చంద్రబాబు తెలిపారు.

# సర్టిఫికెట్ల కష్టాలకు చెక్.. వాట్సప్ ద్వారానే పౌర సేవలు: మంత్రి లోకేశ్



ఢిల్లీ: ఏపీలో పౌర సేవలు మరింత సులభతరం కానున్నాయి. ఈ మేరకు మెటా– ఏపీ ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ..యువగళం హామీలు నెరవేర్చడంలో మెటాతో ఎంవోయూ చారిత్రాత్మక మైలురాయిగా అభివర్ణించారు. "విద్యార్థులు, నిరుద్యోగులు వివిధ సర్టిఫికెట్ల కోసం పడుతున్న కష్టాలు యువగళం పాదయాత్ర సందర్భంగా ప్రత్యక్షంగా చూశా. మొబైల్ ద్వారానే ఆయా సర్టిఫికెట్లు అందిస్తామని పాదయాత్రలో హామీ ఇచ్చా. ఇచ్చిన హామీ మేరకు వాట్సప్ ద్వారానే వివిధ రకాల సర్టిఫికెట్లు, పౌరసేవలు అందించేలా మెటాతో ఒప్పందం చేసుకున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని సేవలు ఆన్‌లైన్‌లో అతి సులువుగా, పారదర్శకంగా, అతి వేగంగా పొందే ఏర్పాట్లు చేస్తాం" అని మంత్రి లోకేశ్ తెలిపారు.

**ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చాలా సంతోషం: మెటా ఇండియా**

మెటాలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సేవలను వినియోగించుకుని వాట్సప్ ద్వారా ఏపీ ప్రజలకు పౌర సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్ సంధ్యా దేవనాథన్ తెలిపారు. ప్రజలు తమకు కావాల్సిన సేవలు పొందేందుకు వీలుగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, వాట్సప్ అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్ ఫేస్ ఉంటుందన్నారు. డిజిటల్ టెక్నాలజీని వాడుకుని ఏపీ ప్రభుత్వం ద్వారా ప్రజలకు మరిన్ని ఉత్తమ సేవలు అందించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. దిల్లీలోని 1 జన్‌పథ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మెటా సంస్థ ప్రతినిధులు రవిగార్గ్, నటాషా, ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్, ఐఏఎస్ అధికారి పాల్గొన్నారు.

# ప్రియాంకా గాంధీ కంటే.. నేనే సీనియర్ - నవ్యా హరిదాస్



న్యూఢిలీ: తొలిసారిగా ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగుపెట్టిన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంకా గాంధీకి వయనాడ్‌లో ముక్కోణపు పోటీ ఎదుర్కొంటున్నారు.దశాబ్దకాలంగా ప్రజాప్రతినిధిగా ఉన్న భాజపా అభ్యర్థి నవ్యా హరిదాస్ ప్రియాంకకు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో పీటీఐ వార్త సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చిన నవ్య.. ప్రజాప్రతినిధిగా ప్రియాంక కంటే తనకే ఎక్కువ రాజకీయ జీవితం ఉందని, ఈ ఎన్నికల్లో తనదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. "నెహ్రూ కుటుంబ నేపథ్యం ఉన్నందున ప్రియాంకకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. కానీ, ఇది ఆమెకు తొలి ఎన్నిక. మరోవైపు కొయ్‌కోడ్ కౌన్సిలర్‌గా వరుసగా రెండుసార్లు పనిచేశా. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశా. ఎన్నో ఏళ్లుగా ప్రజాప్రతినిధిగా ఉన్నందున.. ప్రియాంకపై పోటీ చేయడం భిన్నంగా ఏమీ అనిపించడం లేదు. ఆమె కంటే నాకే ఎక్కువ రాజకీయ అనుభవం ఉందని భావిస్తున్నా" అని నవ్యా హరిదాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ బాధ్యతారాహిత్యం వల్ల ఈ ఎన్నిక అనివార్యమైందని, సోదరి కోసం వయనాడ్‌ను రాహుల్ వదిలేశారని విమర్శించారు. కుటుంబ ఆధిపత్యానికి ఇదో ఉదాహరణ అని.. ఇదే అంశాన్ని ఓటర్ల ముందుకు తీసుకెళ్తానని అన్నారు.

**సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నుంచి..**

బీటెక్ పూర్తిచేసిన నవ్యా హరిదాస్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశారు. 2009లో మెరైన్ ఇంజినీర్ శోబిన్ శ్యామ్‌ను వివాహం చేసుకున్న తర్వాత సింగపూర్ వెళ్లారు. అక్కడ నాలుగేళ్లపాటు ఐటీ కంపెనీలో పనిచేశారు. అనంతరం నెదర్లాండ్స్, అజైర్‌బైజాన్‌లలో పనిచేశారు. ఈ క్రమంలో 2015లో భారత్‌కు వచ్చిన ఆమె ఊహించని పరిస్థితుల్లో రాజకీయాల్లో అడుగుపెట్టారు.ఆర్‌ఎస్‌ఎస్ కుటుంబ నేపథ్యం ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రావడం, అందులో విజయం సాధించి కొయ్‌కోడ్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. గత రెండు పర్యాయాలుగా కౌన్సిలర్‌గా కొనసాగుతున్న ఆమె, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. ప్రస్తుతం ఆమె భాజపా రాష్ట్ర మహిళా మోర్చా జనరల్ సెక్రటరీగా ఉన్నారు.ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలీ, వయనాడ్‌ల నుంచి పోటీ చేసి గెలిచిన రాహుల్ గాంధీ..వయనాడ్ స్థానాన్ని వదులుకున్నారు. దీంతో ఉపఎన్నిక అనివార్యమైంది. భాజపా నుంచి నవ్యా హరిదాస్, కాంగ్రెస్ నుంచి ప్రియాంకా గాంధీ రంగంలో దిగగా.. ఎల్‌డీఎఫ్ తరఫున సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే సత్యన్ మొకెరీ పోటీ చేస్తున్నారు. నవంబర్ 13న ఉప ఎన్నిక జరగనుంది.

# ఏపీకి తీవ్ర తుపాను ముప్పు... ఆ జిల్లాలకు భారీ హెచ్చరిక




అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అల్పపీడనాలు ముంచేస్తున్నాయి. ఒకదాని తర్వాత మరొకటిగా బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడుతూ, అవి వాయుగుండాలుగా మారుతూ అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.బుడమేరు పొంగి సగం విజయవాడ నగరం మునిగిపోయి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న తరుణంలో బంగాళాఖాతంలో తీవ్ర తుపాను ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. సోమవారం ఉదయం ఏర్పడిన అల్పపీడనం అదేరోజు సాయంత్రానికి బలపడి మంగళవారం ఉదయానికి వాయుగుండంగా మారింది.

**తీవ్ర తుపానుగా మారే అవకాశం**

బుధవారంకానీ, గురువారంకానీ ఇది తీవ్ర తుపానుగా మారుతుందని, గురువారం అర్ధరాత్రికి లేదంటే శుక్రవారం తెల్లవారుజామున ఒడిసాలోని పూరీ, పశ్చిమబెంగాల్ లోని సాగర్ ద్వీపం మధ్య తీరం దాటొచ్చని వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది. ఒకవేళ ఇది తీవ్ర తుపానుగా మారితే దానా అనే పేరు పెట్టడానికి అధికారులు సిద్ధం చేశారు. పశ్చిమబెంగాల్, ఒడిసాతోపాటు ఏపీలోని ఉమ్మడి జిల్లాలైన విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, మత్స్యకారులెవరూ వేటకు వెళ్లొద్దని, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**తీసుకుంటున్న చర్యలను తెలిపిన సిసోడియా**

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రత్యేక కార్యదర్శి సిసోడియా తెలిపారు. తుపాను హెచ్చరికలతో కేంద్ర కేబినెట్ కార్యదర్శి సంబంధిత శాఖలతోపాటు ఒడిసా, పశ్చిమ బెంగాల్, ఏపీ రాష్ట్రాలకు చెందిన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను సందర్భంగా ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆర్పీ సిసోడియా ఈ సమావేశంలో పాల్గొని కేంద్ర కేబినెట్ కార్యదర్శికి తెలియజేశారు.

# విజయవాడ మెట్రోను అమరావతికి అనుసంధానించాలి: మంత్రి నారాయణ



దిల్లీ: కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఏపీ మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ మంగళవారం దిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులపై కీలకంగా చర్చించారు.విశాఖ, విజయవాడ మెట్రోపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. విజయవాడ మెట్రోను అమరావతికి అనుసంధానం చేయాలని మంత్రి నారాయణ ప్రతిపాదించారు. ఇప్పటికే దీనికి సంబంధించి ప్రతిపాదనలు పంపినట్టు కేంద్రమంత్రి ఖట్టర్ దృష్టికి తెచ్చారు. అమృత్ పథకం అమలుపై కూడా కీలక చర్చ జరిగింది. మెట్రో ప్రాజెక్టులపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఖట్టర్ చెప్పినట్టు సమాచారం.గత తెదేపా ప్రభుత్వంలో విజయవాడ మెట్రో ప్రాజెక్టు టెండర్ల వరకు వెళ్లింది. తర్వాత ప్రభుత్వం మారడంతో మెట్రో ప్రాజెక్టును పక్కన పెట్టేశారు. భూసేకరణనూ గత ప్రభుత్వం ఉపసంహరించింది. తాజాగా కూటమి ప్రభుత్వ రాకతో మెట్రో ఎండీగా ఎన్‌పీ రామకృష్ణారెడ్డిని నియమించారు. విజయవాడలో లైట్ మెట్రోకు మళ్లీ ప్రతిపాదిస్తున్నారు. పీఎన్‌బీఎస్ నుంచి ఒక కారిడార్ ఏలూరు రోడ్డులో, మరో కారిడార్ బందరు రోడ్డులో రానుంది. ప్రస్తుతం సుదీర్ఘ పైవంతెన ఎన్‌హెచ్‌ఏఐ నిర్మించనుంది. మెట్రో లైనుకు ఆటంకం లేకుండా ఆదిలోనే చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు.

# సాక్షి సంచలన వ్యాఖ్యలు.. తోసిపుచ్చిన వినేశ్ ఫొగాట్



న్యూఢిల్లీ : మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించాడంటూ జాతీయ రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ పై భారత స్టార్ రెజ్లర్లు దిల్లీ వీధుల్లో చేసిన ఆందోళన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే.అయితే నిరసన సమయంలో కలిసికట్టుగా పోరాడిన ఆ కుస్తీ యోధుల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయి. సాక్షి మాలిక్ వ్యాఖ్యలతో ఆ విషయం బయటపడింది. ఇక ఆమె చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ విభేదించారు.గత సంవత్సరం ఆసియా క్రీడల ట్రయల్స్ నుండి మినహాయింపు కోరుతూ వినేశ్, బజరంగ్ పునియాలు అభ్యర్థించడం తమ నిరసనను బలహీన పరిచిందని సాక్షి మాలిక్ అభిప్రాయపడ్డారు. దీనిపై వినేశ్ స్పందిస్తూ.. "అది ఆమె వ్యక్తిగత అభిప్రాయం. ఆ మాటలను అంగీకరించను. నేను బలహీనంగా ఉంటే తప్పు.. పోరాటం బలహీనం కాదు. అది నా నమ్మకం. సాక్షి, వినేశ్, బజరంగ్ పునియా బతికున్నంతకాలం.. ఆ పోరాటం బలహీనపడదు. గెలవాలని అనుకునేవారు ఎప్పటికీ బలహీనులు కాకూడదు. వారు పోరాటాన్నే ఎంచుకోవాలి. ఆ క్రమంలో ఎన్నో అడ్డంకులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకు మేం సిద్ధంగా ఉన్నాం" అని వినేశ్ అన్నారు.ఇటీవల 'విట్‌నెస్' పేరుతో సాక్షి మాలిక్ విడుదల చేసిన పుస్తకంలో పలు అంశాలపై స్పందించారు. వినేశ్, పునియా చుట్టూ ఉన్న మనుషులు వారి మనసులను దురాశ నింపడంతో తమ నిరసనకు పగుళ్లు రావడం మొదలైందని ఆమె అందులో వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే.. హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు ముందు వినేశ్, పునియా కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. జులానా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన వినేశ్ విజయం సాధించారు.

# ఆ పరిస్థితి వస్తేనే బలగాల ఉపసంహరణ: ఆర్మీ చీఫ్




దిల్లీ: 2020 కంటే ముందున్న పరిస్థితి ఏర్పడితేనే బలగాలను వెనక్కి రప్పిస్తామని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది అన్నారు."ఏప్రిల్ 2020 ముందునాటి యథాతథ స్థితికి తిరిగి వెళ్లాలని అనుకుంటున్నాం. ఆ తర్వాతే బలగాల ఉపసంహరణ, ఎల్ఏసీ వద్ద సాధారణ నిర్వహణను పరిశీలిస్తాం. 2020 నుంచి మా వైఖరి అదే. చైనాతో సరిహద్దుల్లో విశ్వసనీయతను పునరుద్ధరించుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. బఫర్‌జోన్‌లోకి ప్రవేశించబోమని ఒకరికొకరం భరోసా ఇచ్చుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ ఇరుదేశాలు కీలక గస్తీ ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఆయన స్పందన వచ్చింది.తాజా ఒప్పందం ప్రకారం.. 2020 నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి ఇక కొనసాగనుంది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఈ విషయాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సోమవారం విలేకరుల సమావేశంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. "వాస్తవాధీన రేఖ వెంబడి గస్తీ పునఃప్రారంభంపై ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. గత కొన్ని వారాలుగా దౌత్య, సైనిక సంధానకర్తలు జరుపుతున్న చర్చల ఫలితంగా ఈ పురోగతి చోటుచేసుకుంది" అని ఆయన తెలిపారు. రష్యాలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు మంగళవారం ప్రధాని మోదీ బయల్దేరతారనగా ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రకటన వెలువడటం గమనార్హం. సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశాలున్నాయని దౌత్య వర్గాలు పేర్కొంటున్నాయి.2020 జూన్ 15న తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్–చైనా సైనికుల మధ్య జరిగిన తీవ్ర ఘర్షణ ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. ఘర్షణలో తెలంగాణకు చెందిన కర్నల్ సంతోష్ బాబు సహా 20 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. చైనా కూడా భారీగా సైనికులను కోల్పోయింది. కానీ ఆ సంఖ్యను వెల్లడించలేదు. చాలా నెలల తర్వాత ఐదుగురు చనిపోయినట్లు అధికారికంగా అంగీకరించింది. ఘర్షణల నేపథ్యంలో ఇరు దేశాలు ఎల్ఏసీ వెంబడి భారీ స్థాయిలో బలగాలను మోహరించాయి. అప్పటినుంచి రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**ఒప్పందాన్ని ధ్రువీకరించిన చైనా..**

తూర్పు లద్దాఖ్‌లో ప్రతిష్టంభనకు ముగింపు పలికేందుకు భారత్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని మంగళవారం చైనా ధ్రువీకరించింది. సరిహద్దు సంబంధిత సమస్యలపై మిలిటరీ, దౌత్య మార్గాల ద్వారా రెండు దేశాల మధ్య కొంతకాలంగా సంప్రదింపులు కొనసాగాయని తెలిపింది. ఈ ఒప్పందాన్ని అమలు చేయడానికి భారత్‌తో కలిసి పనిచేస్తామని వెల్లడించింది.

# అమరావతి రైల్వే లైన్ నిర్మాణంలో కేంద్రం కీలక అడుగు!



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం చంద్రబాబు నిజంగానే రాష్ట్రానికి రాజధానిగా అమరావతిని ప్రపంచమంతా గుర్తించేలా తీర్చి దిద్దాలని భావిస్తున్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కూడా తమ సమావేశాల్లో అమరావతి నిర్మాణానికి సహకరిస్తామని చెప్పారు.ఈ క్రమంలోనే అమరావతి మీదుగా రైల్వేలైన్ ప్రకటించిన కేంద్రం అమరావతి ప్రగతికి రైల్వే ద్వారా పనుల వేగాన్ని పెంచింది.ప్రస్తుతం అమరావతికి వెళ్లే రైలు మార్గాన్ని రూపొందించేందుకు భారతీయ రైల్వే సంస్థ వేగంగా కృషి చేస్తోంది. రాజధాని అమరావతికి వెళ్లే కొత్త రైలు మార్గాన్ని నిర్మించేందుకు కొంత భూమిని తీసుకోనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ముఖ్యంగా ఎర్రుపాలెం, అమరావతి, నంబూరు మధ్య ప్రాంతాలలో రైలు మార్గానికి అవసరమైన భూమిని సేకరించాలని కార్యాచరణ మొదలు పెట్టింది.ఈ మేరకు ఎర్రుపా లెం – అమరావతి – నంబూర్ రైల్వే లైన్ కోసం భూసేకరణ నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. గుంటూరు జిల్లాలోని 97 గ్రామాలలో భూసేకరణకు నోటిఫికేషన్ ఇవ్వటంతో భూసేకరణలో వేగం పుంజుకోనుంది. కొత్త రైల్వే ట్రాక్ నిర్మించేందుకు తెలంగాణ ప్రాంతంలోనూ భూసేకరణ చేస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో సహాయం చేయడానికి, ఖమ్మం జిల్లా నుండి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను పర్యవేక్షించడానికి నియమించారు.ఖమ్మం జిల్లాలోని రెండు ప్రాంతాల్లో రైల్వే ట్రాక్ నిర్మాణం, సంరక్షణ బాధ్యతలను ప్రత్యేక అధికారి నిర్వహిస్తారు.ఈ రైల్వే ట్రాక్ 56.53 కిలోమీటర్ల పొడవు ఉంటుంది . ఎర్రుపాలెం నుండి అమరావతి మీదుగా నంబూరును కలుపుతుంది. దీని వలన ప్రజలు ఆంధ్రప్రదేశ్‌లోని రాజధాని నగరమైన అమరావతికి సులభంగా ప్రయాణించవచ్చు.గుంటూరు, పల్నాడు, కృష్ణా, ఖమ్మం వంటి కొన్ని ప్రాంతాల్లో కొత్త రైలు మార్గాన్ని నిర్మించేందుకు దాదాపు 450 హెక్టార్ల భూమిని వినియోగించుకోనున్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూమిని సేకరించటం కోసం దాదాపు 2600 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని రైల్వే భావిస్తుంది. ఈ కొత్త రైల్వే లైన్ లో మొత్తం తొమ్మిది స్టేషన్లు ఉండనున్నాయి.పెద్దాపురం, చిన్నరావులపాలెం, గొట్టిముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావురు స్టేషన్లు ఈ రైల్వే లైన్ లో ఉంటాయి. వీటిలో అమరావతిని ప్రధాన స్టేషన్‌గా అభివృద్ధి చేయటానికి రైల్వే నిర్ణయం తీసుకుంది. 2029 నాటికి అమరావతి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని చంద్రబాబు భావిస్తున్నందున, వచ్చే మూడేళ్లలో అమరావతికి రైల్వే ట్రాక్ పూర్తి చేసేందుకు రైలు శాఖ కసరత్తు చేస్తోంది. ప్రస్తుత రాజధాని అమరావతికి కనెక్ట్ అయ్యేలా రైల్వే ట్రాక్ నిర్మాణ పనుల్లో భూసేకరణనోటిఫికేషన్‌తో కీలక అడుగు పడింది.

రాయల్ జర్నలిజం ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# ఎడిటోరియల్

## వట్టి బెదిరింపులేనా?

ఇది కనివిని ఎరుగని కథ. వారంరోజుల్లోనే మన విమానాలకు శతాధికంగా బాంబు బెదిరింపు కాల్స్... వివిధ జాతీయ, అంతర్జాతీయ విమానయాన సంస్థలకు చెందిన పలు విమానాలను అర్ధంతరంగా దింపాల్సి రావడం, దారి మళ్ళించడం, చివరకు ఫైటర్ జెట్ల రక్షణ మధ్య తీసుకువెళ్ళాల్సి రావడం జరిగింది. ఈ–మెయిల్, సోషల్ మీడియా అజ్ఞాత పోస్టుల బెదిరింపులతో భారత వైమానిక రంగం ఉలిక్కిపడింది. ఏ బెదిరింపు వచ్చినా నిశితంగా పరీక్షించి, జాగ్రత్త చేపట్టాలన్నది నిబంధన కావడంతో విమానయాన పరిశ్రమపై తాజా బెదిరింపుల ప్రభావం అంతా ఇంతా కాదు. ఖలిస్తానీ తీవ్రవాది గురుపథ్‌వంత్ సింగ్ పన్నూ సైతం ఎయిరిండియా విమానంపై దాడి చేస్తామనీ, నవంబర్ 1–19 మధ్య ఎయిరిండియాలో ప్రయాణించవద్దనీ హెచ్చరించడంతో కథ కొత్త మలుపు తిరిగింది. పెరుగుతున్న భద్రతా సమస్యలపై విమానయాన శాఖ మల్లగుల్లాలు పడుతోంది. బెదిరింపులకు పాల్పడినవారిపై తీవ్ర శిక్షలు విధించేలా చట్టంలో మార్పులు చేయాలనీ, దోషుల్ని విమానయానం నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని భావిస్తున్నామనీ కేంద్ర మంత్రి మాట. భవిష్యత్తుకు పనికొచ్చే ఆ చర్యల మాటెలా ఉన్న వర్తమానంలో తక్షణ మార్గాంతరమేమిటన్నదే ఇప్పుడు ప్రశ్న. 2014 – ‘17 మధ్య అంతా కలిపి 120 బాంబు బెదిరింపులే రాగా, ఇప్పుడు ఒక్కవారంలోనే 100కు పైగా బెదిరింపులు రావడం గమనార్హం. విమానాల దారి మళ్ళింపు, తక్షణ ల్యాండింగ్ వల్ల అయ్యే ఇంధన వృథా ఖర్చు, వగైరాలతో ప్రతి బెదిరింపు కాల్ వల్ల ఎయిర్‌లైన్స్‌కు రూ. 3 కోట్ల పైగా నష్టమట! ప్రయాణికుల్లో భయాందోళనల్ని పెంచడంతో పాటు ప్రయాణంలో ఆలస్యంతో కీలకమైన పనులు దెబ్బతినడం లాంటివి సరేసరి. రద్దీ ఎక్కువగా ఉండే పండగ సీజన్ కావడంతో కష్టం, నష్టం ఎక్కువ. ఒక్క వారంలోనే వంద బెదిరింపులు వచ్చాయంటే భద్రతా వ్యవస్థలు, సైబర్ సెక్యూరిటీలు ఏం చేస్తున్నట్టు? ఇప్పటి వరకు ఒక మైనర్‌నీ, అతని తండ్రినీ మాత్రమే అరెస్ట్ చేసినట్టు వార్త. నింది తుల్ని వేగంగా కనిపెట్టి, కఠినచర్యలకు ఎందుకు దిగడం లేదు? అయితే ముష్కరులు, తీవ్రవాదులు వర్చ్యువల్ ప్రైవేట్ నెట్‌వర్క్‌ల ద్వారా ఈ నకిలీ బెదిరింపు కాల్స్ చేస్తున్నారు. దాంతో, వారున్న లొకేషన్ కనిపెట్టలేని పరిస్థితి. ఈ సవాలును అధిగమించేందుకు మార్గాలు అన్వేషించాలి. నిజానికి, విమాన సర్వీసులకే కాదు... కొద్ది నెలలుగా రైల్వేలకూ ఈ బెడద తప్పడం లేదు. రైల్వే ట్రాకుల మీద రాళ్ళు, గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్ నింపిన సీసాల లాంటివి దుండగులు పెడుతున్న ఘటనలు చూస్తున్నాం. ఆ మధ్య అనేక చోట్ల వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను లక్ష్యంగా చేసుకొని రాళ్ళు విసిరిన ఉదంతాలూ చూశాం. ఈ చర్యల వెనుక పెద్ద పన్నాగమే ఉందని విశ్లేషకుల మాట. దేశంలో విమానయాన రంగం వేగంగా దూసుకుపోతోంది. ఒక్క 2023లోనే 15.2 కోట్ల మంది దేశంలో విమానయానం చేశారు. అలాంటిది... ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో భారత వైమానిక రంగాన్నీ, రైల్వేలనూ గనక అప్రతిష్ఠ పాల్జేస్తే, ఆర్థిక నష్టంతో పాటు భూమి మీదైనా, ఆకాశంలోనైనా సురక్షితంగా ప్రయాణం చేయలేమనే భీతిని దేశ, విదేశీ ప్రయాణికుల్లో పెంచాలన్నది కుట్ర. భయం పెంచి, ప్రాణాలతో చెలగాటమాడే ఇలాంటి విద్రోహ చర్యలను తక్షణం అరికట్టాలి. చిత్రమేమిటంటే, ఐరోపా గగనతలంలోనూ భారత విమానయాన సంస్థలకు బెదిరింపులు వస్తున్నాయి. భారత ప్రభుత్వం, గూఢచర్య వ్యవస్థలు ఈ వ్యవహారాన్ని తేలికగా తీసుకుంటే పెను ప్రమాదమే! భారత్‌కు తీరని నష్టం కలిగించడమే ధ్యేయంగా పెట్టుకొన్న ఖలిస్తానీ తీవ్రవాది గురుపథ్‌వంత్ సింగ్ పన్నూ ఎయిరిండియా విమానాలను పేల్చేస్తామంటూ గత ఏడాది నవంబర్ లోనూ ఇలానే బెదిరింపులకు దిగాడు. అతను, అతని అనుచరుల ఆనుపానులు, దుశ్చర్యలు తెలిసినప్పటికీ అమెరికా గూఢచారి వ్యవస్థ ఎఫ్‌బీఐ లాంటివి కళ్ళు మూసుకొని, వారిని కాపాడుతూ వస్తుండడమే విషాదం. మరోపక్క దేశీయ విమానాల్లో సిక్కు ప్రయాణికులు కృపాణాలతో ప్రయాణించడాన్ని నిరోధించేందుకు సుప్రీమ్ కోర్టు సైతం నిరాకరించడంతో, పన్నూ లాంటి వారు దాన్ని అవకాశంగా తీసుకొంటే కష్టమే. ఈ ఖలిస్తానీ తీవ్రవాదులు ఒకటికి రెండు తీవ్రవాద బృందా లను కలుపుకొనిపోతే పెను ప్రమాదమే. దాదాపు పాతికేళ్ళ క్రితం 2001 సెప్టెంబర్ 11న తీవ్ర వాదులు విమానాల హైజాక్‌తో అమెరికాలోని ప్రపంచ వాణిజ్య కేంద్రం జంట భవనాల కూల్చి వేతతో సహా 3 వేల మంది మరణానికి కారణమైన ‘9/11’ ఘటనను విస్మరించలేం. ఈ పరిస్థితుల్లో ఈ ముష్కరమూకలకు పరోక్షంగా అండగా నిలుస్తున్న అమెరికా, కెనడాలకు పరిస్థితిని వివరించి, దేశ సార్వభౌమాధికారాన్ని పరిరక్షించుకొనే దిశగా భారత ప్రభుత్వం కట్టుదిట్ట మైన చర్యలు చేపట్టాలి. మన ప్రయాణ వ్యవస్థలతో పాటు పౌరుల భద్రత అత్యంత ప్రధానమని తెలియజెప్పాలి. అవసరమైతే అంతర్జాతీయ న్యాయస్థానాన్నీ, ఐరాస భద్రతా మండలినీ ఆశ్రయించాలి. అదే సమయంలో కొద్దివారాల పాటు టెక్నాలజీని తమ చేతుల్లోకి తీసుకోవడం వల్లే ముష్క రులు ‘9/11’ ఘటనకు పాల్పడగలిగారని మర్చిపోరాదు. సాంకేతికంగా ముష్కర చేష్టలకు వీలు కల్పించే ట్రాన్సీవర్స్ లాంటి సాంకేతిక సామగ్రిని ఆన్‌లైన్‌లో అమ్మడాన్ని తక్షణం నిషేధించడం అవసరమని నిపుణుల సూచన. అన్నిటి కన్నా ముఖ్యంగా యుద్ధ ప్రాతిపదికన మన విమాన, రైల్వే భద్రతా వ్యవస్థలను పునఃపరిశీలించి, సరికొత్త సవాళ్ళకు అనువుగా పటిష్ఠం చేయాలి. అత్యవసర పరిస్థితిలో అనుసరించాల్సిన ప్రామాణిక ఆచరణ విధానాలను (ఎస్ఓపీ) సిద్ధం చేయాలి. అదే సమయంలో అన్ని ఎయిర్‌లైన్స్, వివిధ దేశాల వైమానిక రంగాలు ఒక్కటై, సమాలోచనలు జరపాలి. పెరుగుతున్న ముప్పును పరస్పర సహకారం, సమన్వయంతో ఎలా ఎదుర్కోవాలో చూడాలి.

# రైతులకు వరంలాంటి రైతు బజార్ ప్రారంభం



రాయల్ జర్నలిజం (బాపట్ల) అక్టోబర్ 22: రైతు ఉత్పత్తులు నేరుగా విక్రయించుకునే అవకాశం కల్పిస్తూ రైతు బజార్లను ప్రభుత్వం ప్రారంభిస్తున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. బాపట్ల పట్టణంలోని ఎన్టీఆర్ కూరగాయల మార్కెట్ వద్ద మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతు బజార్ ను జిల్లా జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ కలిసి రిబ్బన్ కత్తిరించి మంగళవారం ప్రారంభించారు. రైతులకు మేలు కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ చెప్పారు. రైతులు పండించుకున్న పంటలు నేరుగా రైతు బజార్లకు తెచ్చుకుని విక్రయించుకోవచ్చున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రైతులను ప్రజలు ఆదరించాలని కోరారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి రైతు బజార్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. రైతుల సంక్షేమం కోరుతూ ఇలాంటి చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలకు తక్కువ ధరలో కూరగాయలు అందించడానికి ఇదొక చక్కని మార్గమన్నారు. గత కొంతకాలంగా మూతపడిన రైతు బజార్లను ప్రభుత్వం పునఃప్రారంభస్తుందని చెప్పారు. రైతు బజార్ వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించామన్నారు. రహదారిపై ఆక్రమణలు, ఆటంకాలు తొలగించామన్నారు. ప్రజలు సహకరించాలని, రైతులను ఆదుకోవాలని ఆయన సూచించారు. అనంతరం జిల్లా





సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ పుట్టినరోజు కావడంతో శాసనసభ్యులు నరేంద్ర వర్మ అప్పటికప్పుడే కేక్ తెప్పించి రైతు బజార్ ప్రారంభం అనంతరం పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ కేక్ కట్ చేయగా ఎమ్మెల్యే ఆయనకు తినిపించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డి డి జాన్సీరాణి, మార్కెటింగ్ శాఖ ఏడి రమేష్ బాబు, ఆ శాఖ డీఈఇ పవన్ కుమార్, మున్సిపల్ కమీషనర్ రఘునాథ రెడ్డి, రైతు బజార్ పర్యవేక్షణ అధికారి జి. ఫణింద్ర, శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# కలక్టరేట్‌లో ఘనంగా నిర్వహించిన ఎస్.ఆర్ శంకరన్ జయంతి వేడుకలు



రాయల్ జర్నలిజం (బాపట్ల) అక్టోబర్ 22: పేదల కలెక్టర్ గా ఎస్ఆర్ శంకరన్ ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్నారని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఎస్.ఆర్ శంకరన్ జయంతి కార్యక్రమం మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో జరిగింది. కలెక్టరేట్ ఆవరణలోని ఎస్ఆర్ శంకరన్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదల కలెక్టర్ శంకరన్ నేటి ఐఏఎస్ అధికారులు అందరికీ ఆదర్శప్రాయుడని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. ఎస్.ఆర్ శంకరన్ మెమోరియల్ ట్రస్ట్ పిసి సాయిబాబు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. హరగోపాల్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్ చక్రవర్తి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎన్ రమేష్ కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆర్ సుబ్రమణ్యం, ఎపి హెచ్ ఆర్ డి ఐ మాజీ డైరెక్టర్ జనరల్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి. చక్రపాణి, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మనోబంధు ఫౌండేషన్ ఏర్పాటుచేసిన మనోబంధు మొబైల్ వాహనాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ జెండా ఊపి ప్రారంభించారు. నిరాశ్రయులై, నిరాధారణకు గురైన మానసిక దివ్యాంగులను పునరావాస కేంద్రాలకు వివాహనం తరలిస్తుందన్నారు. రాష్ట్రస్థాయిలో నడిచే మనో బంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాలలో పునరావాస కేంద్రాలు ఉన్నాయన్నారు. ఏ ప్రాంతంలోనైనా మానసిక దివ్యాంగులు ఉంటే వారి భవిష్యత్తు కొరకు మంచి వైద్యం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మనో బంధు ఫౌండేషన్ బి రామకృష్ణమరాజు, సభ్యులు డి ఇమ్మానియేలు, డి ఆర్ ఓ సిహెచ్ సత్తిబాబు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడికి అందనంత దూరంలో కూరగాయ ధరలు

### రైతు అమ్మే కూరగాయలకు ధర ఉండదు సామాన్యుడి కొనే కూరగాయలకు ధర బగ్గు మంటుంది



రామసముద్రం. అక్టోబర్ 22 రాయల్ జర్నలిజం. సామాన్యుడికి ఆమడ అందనంత కూరగాయలు ధరలు మండలంలో సామాన్యుల పరిస్థితి దైనింగా మారిపోతుంది. కూరగాయలు కొని తినే పరిస్థితిలో లేకుండా పోతుంది. రైతు పండించిన పంట కు ధర లేదు కూరగాయల అంగడిలో కొనలేము టమోటా కిలో దాదాపు70 నుండి 80 రూపాయల మధ్యన ధర పలుకుతుంది క్యారెట్ 160 రూపాయలు ఉండగా బీచ్ నేనేమీ తక్కువ కాదు 90 రూపాయలు నుండి 100 రూపాయలు వరకు పలుకుతుంది. వంకాయ 80 రూపాయలు, బీట్రూట్ 85 రూపాయలు, క్యాప్సికం 80 రూపాయలు, కొత్తిమీర కట్ట 30 రూపాయలు, పుదీనా కట్ట 25 రూపాయలు, కూరాకు కట్ట 20 రూపాయలు, ఇలా సామాన్యుడికి అందనంత దూరంలో కూరగాయ ధరలు భగభగమంటున్నాయి. రైతన్న కూరగాయలకు మాత్రం ధర ఉండకపోవడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ధరలు లేక బంతిపూల రైతులు విలవిల

- బంతిపూలు ఐదు రూపాయలు
- చామంతి పది రూపాయల నుంచి 15 రూపాయల వరకు
- రోజాపూలు 30 నుంచి 40 రూపాయలు వరకు తీవ్ర నష్టాలలో రైతన్నలు



రామసముద్రం. అక్టోబర్ 22 రాయల్ జర్నలిజం: రామసముద్రం మండలం లో బంతిపూలు చామంతి సాగు జోరుగా చేశారు. దసరాకి నామమాత్రంగా ధర పలికిన గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వలన పూలు కూడా అధికంగా రావడంతో ధరలో పూర్తిగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. మండలంలోని పూలన్నీ దిన్నె పల్లె గేట్లో మార్కెట్ కి వస్తుంటాయి అక్కడ నుండి చెన్నై తిరుపతి బెంగళూరు విజయవాడ గుంటూరు విశాఖపట్నం నెల్లూరు హైదరాబాద్ ఇలా మొదలగు ప్రధాన మార్కెట్లకు వెళు తుంటాయి. అక్కడ కనీసం పూలకి ధర లేకపోవడంతో వెళ్లిన వాహనాలు తిరిగి తీసుకెళ్లిన పూలని తిరిగి తీసుకొచ్చి దారి మధ్యలో పారుపోయాల్సి వస్తుందని రైతన్న లో వాపోతున్నారు. అక్కడ బంతిపూలు ఐదు రూపాయలు, చామంతి 15 రూపాయలు, గులాబీ పూలు 30 రూపాయలు పలుకుతున్నాయని బంతిపూల సాగు చేయాలంటే ఒక ఎకరంకు దాదాపు లక్ష రూపాయలు ఖర్చు వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూలు కోసే కూలి ఒక వ్యక్తికి 500 రూపాయలు ఖర్చు వస్తుందని ఒకసారి ఎకరమకు మందు పిచికారి చేస్తే పదివేల రూపాయలు ఖర్చు అవుతుందని పంట బాగా వచ్చినా కానీ ధర లేకపోవడంతో మేము కోలుకోలేకపోతున్నామని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బంతిపూల రైతులను ఆదుకోవాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బంతిపూల రైతులు తదితరులు పాల్గొన్నారు.



# నేడు శ్రీ సీతారామస్వామి వారి కళ్యాణోత్సవం



రామసముద్రం అక్టోబర్ 22 రాయల్ జర్నలిజం: మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లి గ్రామంలో శ్రీ సీతారామస్వామి వారి కల్యాణమహోత్సవం బుధవారం సాయంత్రం సీతరాముల వారికి అభిషేకం మరియు కళ్యానోత్సవం వైభవంగా నిర్వహిస్తామని గ్రామస్తులు గ్రామ పెద్దలు తెలియ చేసారు. రాత్రి స్వామి వారు పురవీదుల్లో ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వామి వారి ఊరేగింపు సందర్భంగా గ్రామం మొత్తం విద్యుత్ దీపాలంకరణతో గ్రామం మొత్తం కళకళలాడుతుంది. బంధువుల రాకతో గ్రామం సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి మండల ప్రజలు భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ధర్మకర్తలు, గ్రామపెద్దలు, గ్రామస్తులు తెలిపారు.

# అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్న గ్రామస్తులు



రామసముద్రం అక్టోబర్ 22 రాయల్ జర్నలిజం: అనాధ శవానికి గ్రామస్తులు కలిసి అంత్యక్రియలు జరిపించి మానవత్వం చాటుకున్నారు. మండల కేంద్రం దినసరి మార్కెట్ లోని షెల్టర్ లో గత కొంత కాలం గా ఉన్న ఓ అనాధ వృద్ధునికి అక్కడి తరకారి వ్యాపారస్తులు రోజూ భోజనం పెట్టేవారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఆ వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. మండల పంచాయతీ సెక్రటరీ నాయక్ ,గ్రామస్తులు అందరూ కలిసి అనాథ మృతునికి అంత్యక్రియలు జరిపించారు. అంత్యక్రియలు జరిపించిన గ్రామస్తులపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# గ్రామాల్లో పటిష్టంగా ఎలుకల నిర్మూలన కార్యక్రమం



రాయల్ జర్నలిజం (కాకుమాను) కాకుమాను మండల పరిధిలోని వరి పండించే 11 గ్రామపంచాయతీలు నందు గ్రామంలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టటం జరిగినది. ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందించే బ్రోమోడయోలిన్ అను రసాయన మందు అందించడమే కాకుండా. ఈ విషపు ఎర తయారీ కొరకు 96 పాళ్ళు నూకలు రెండు పాళ్ళు విషం మందు రెండు పాళ్ల వేరుశెనగ నూనె రెండు గ్రాములు బ్రోమోడయోలిన్ ఉపయోగించి కలిపి రైతులకు 10 గ్రాములు చొప్పున చిన్నచిన్న పేపర్ ప్యాకెట్లలో రైతులకు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మరియు ఆయా గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బంది మరియు గ్రామ సర్పంచులు ఎంపీటీసీలు ఆయాగ్రామ రైతులు పాల్గొనడం జరిగినది. గరికపాడు మరియు తెలగాయ పాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే కిరణ్మయి సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం ద్వారా ఎలుకల మందు పంపిణీ చేయడం జరిగినది. మరియు ప్రకృతి వ్యవసాయ విభాగం నుంచి రజిని పాల్గొని రైతులకు పలు సలహాలు సూచనలను తెలిపారు. ప్రస్తుతం వరి పంటలో ఉన్న దోమను నివారించడానికి ఆవు మూత్రం ఆవు పేడ మరియు తూటాకు ఉపయోగించి కషాయం తయారు చేసుకునే విధానం గురించి రైతులకు వివరించడం జరిగినది తద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో దోమ నివారణ చేసుకోవచ్చని తెలియజేశారు.

రాయల్ జర్నలిజం ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM
23 WEDNESDAY OCTOBER 2024
బుధవారం 23 అక్టోబర్ 2024


# పౌరులకు వేగవంతంగా సేవలు అందించి రెవెన్యూ శాఖ ప్రతిష్ఠ పెంచాలి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయల్, జర్నలిజం,రాయచోటి, అక్టోబర్ 22:ప్రభుత్వ యంత్రాంగంలో అత్యంత కీలక మైనది రెవెన్యూ శాఖ. పౌరులకు వేగవంతంగా సేవలు అందించి శాఖ యొక్క ప్రతిష్ట ను పెంచేందుకు ప్రతి అధికారి, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ నందలి మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో... రాయచోటి డివిజన్ రెవిన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి, భూ పరిపాలన శాఖ కార్యాలయాలు, పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారం, డివిజన్ లో ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్స్ పరిశీలన, హైకోర్టు, ఆర్టిఐ, జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసులు, భూసేకరణ, అలియనేషన్ ప్రతిపాదనలు, నీటి పన్ను వసూళ్లు, డివిజన్ స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ తీర్మానాలు వాటి అమలు, ఓటరు జాబితా సవరణ తదితర అంశాలలో జిల్లా కలెక్టర్ సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవిన్యూ సేవలలో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యం. ఏదైనా సమస్య వచ్చినప్పుడు వాటిని క్షుణ్ణంగా చదివి తీసుకోవాల్సిన చర్య పై ప్రణాళిక బద్ధంగా కార్యాచరణను అమలు చేయాలన్నారు. రెవిన్యూ చట్టాలు.. విధులను బాధ్యతగా అమలు చేయాలని.. విధుల అమలులో చిత్తశుద్ధి, అంకితభావం ఉండాలి. ప్రభుత్వ ఆలోచనలు క్షేత్రస్థాయిలో అమలు కావాలి. అప్పుడే ప్రజలకు రెవెన్యూ శాఖ పైన ప్రభుత్వం పైన ఎంతో నమ్మకం ఏర్పడుతుంది. పిజిఆర్ఎస్ దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలి. వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఉద్యోగి పనితీరు మెరుగుపరుచుకోవాలని కలెక్టర్




సూచించారు. అంశాల వారీగా సమీక్షలో భాగంగా... సీఎమ్ఓ కార్యాలయం నుంచి ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, పరిష్కరించినవి, ప్రగతిలో ఉన్నవి ఎన్ని, పెండింగ్ కు గల కారణాలపై మండలాల వారీగా తాసిల్దార్లతో సమీక్షించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య పై ఫిర్యాదు అందగానే అది మన పరిధిలో ఉందా లేదా పై స్థాయిలో ఉందా అని అర్థం చేసుకోవాలి. సదరు ఫిర్యాదు పై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలి, అవసరమైనప్పుడు నోటీసు ఇవ్వాలి. వెంటనే చర్యలు తీసుకోవాలి. ఇందులో నోటీసులు ఇవ్వాల్సినవి ఎన్ని, క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాల్సినవి ఎన్ని అన్న విషయంలో పూర్తి అవగాహన కలిగి ఉండాలి. వ్యవస్థలో లోపాలు సరిదిద్దుకొని ముందుకు వెళ్లగలిగినప్పుడే శాఖకు మంచి పేరు వస్తుంది. ఏ సమస్య పైన అయినా కాలాతీతం చేయకుండా వేగంగా నాణ్యతగా పరిష్కరించడమే మన ధ్యేయం కావాలని ఆ దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులలో మొత్తం దరఖాస్తులు ఎన్ని, పరిష్కరించినవి ఎన్ని, ప్రగతిలో ఉన్నవి ఎన్ని, ఎస్ఎల్ఏ పరిధిలో ఉన్న దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తుల పై సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. భూ సమస్యలపై అధికంగా వస్తున్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ఎస్ఎల్ఏ పరిధి దాటకుండా వాటిని పరిష్కరించాలని సూచించారు. ఆయా మండలాలలో జరుగుతున్న ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ పరిశీలన ప్రగతిపై కూడా సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ప్రభుత్వ భూములకు తగు రక్షణ కల్పించాలన్నారు. నీటి పన్ను వసూళ్లను, నీటి వినియోగదారుల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పౌర సేవలకు సంబంధించి సిటిజన్ చార్టర్ ప్రకారం కులం, ఆదాయం, నివాస, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు మొదలైన ధృవపత్రాల జారీ ద్వారా నిర్ణీత కాలంలోపు జారీ చేయాలని పౌరులను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుకోరాదని సూచించారు. స్మశాన వాటికలకు సంబంధించి స్థలం నిమిత్తం దరఖాస్తులు వస్తే వాటిని త్వరగా పరిష్కరించాలి. స్థలం అందుబాటులో ఉంటే వెంటనే మంజూరు చేయాలి లేకపోతే అనువైన స్థలాన్ని మరొకచోట పరిశీలించి స్థల కేటాయింపు చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన పరిపాలనా సంస్కరణలను పటిష్టంగా అమలు చేసి వాటి ఫలాలు అర్హులకు అందేలా కృషి చేయాలన్నారు. అనంతరం అజెండాలోని పలు అంశాలలో తాసిల్దార్లు వెలిబుచ్చిన సందేహాలకు తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఓ సత్యనారాయణరావు, ఆర్డిఓ రంగస్వామి, ఎస్ డి సి రామసుబ్బయ్య, జిల్లా సర్వే శాఖ ఏడి, రాయచోటి డివిజన్ తాసిల్దార్లు, డిటీలు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# కురబలకోటలో బెల్ట్ షాపులు పక్క దారి పడుతున్నాయా




రాయల్ జర్నలిజం (అన్నమయ్య జిల్లా బ్యూరో) అక్టోబర్ 22

రాష్ట్ర స్థాయిలో ఎంతో పగడ్బందీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్రాందీ షాపులు కురబలకోట మండలం లో పక్క దారి పడుతున్నాయా మద్యం ప్రియూలు రాత్రి అనక పగలనక కష్టపడి న డబ్బును గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్రాందీ షాపులు అధిక దరలతో అమ్మి మద్యం ప్రియులను రోడ్డు పాలు చేశారు.తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు తక్కువ ధరలకు అమ్మాలని ప్రభుత్వం నిర్ణయించింది కానీ కొందరు బ్రాందీ షాపు యజమానులు కురబలకోట లో ఎస్ సి కాలిని, బి సి కాలిని,తదితర గ్రామాలలో బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి క్వార్టర్ బెల్ట్ షాపులవారు 30రుపాయలు అదనంగా తీసుకొంటున్నారు.సంబంధించి ఎక్సేజ్ పోలీసులుగాని,ముదివేడు పోలీసులిగాని పట్టించుకోని పాపాన పోలేదు.ఇప్పటికైనా సంబంధించిన అధికారులు బెల్ట్ షాపులు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# వారికి భరోసాగా...జనంలోకి వైఎస్ జగన్



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలకు క్షీణించాయని వైసిపి పెద్ద ఎత్తున విమర్శలు గుప్పిస్తోంది.తాజాగా వైఎస్ఆర్సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో టిడిపి వేధింపులు పెరిగిపోయాయని, ముఖ్యంగా మహిళలపై అఘాయిత్యాలు, దాడులు పెరిగిపోయాయని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.రాష్ట్రంలో జరుగుతున్న దారుణాల విషయంలో స్పందించిన జగన్ స్వయంగా బాధితులను కలిసి వారికి అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే తాజాగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ రేపు ప్రజాక్షేత్రంలోకి వెళ్ళనున్నారు. రేపు రెండు జిల్లాలలో పర్యటించనున్న జగన్ పర్యటనకు షెడ్యూల్ విడుదలైంది. అత్యాచార, హత్య సంఘటనలు జరిగిన గుంటూరు జిల్లాలోనూ, వైఎస్ఆర్ కడప జిల్లాలోనూ రేపు వైయస్ జగన్ పర్యటించనున్నట్టు వైఎస్ఆర్సిపి వర్గాలు వెల్లడించాయి.ఈ మేరకు జగన్ పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రేపు తాడేపల్లి నుండి మొదట గుంటూరు జిల్లాకు రోడ్డు మార్గంలో ప్రయాణించి జగన్ అక్కడ గుంటూరు జిల్లా తెనాలిలో ఇటీవల టిడిపి కార్యకర్త, రౌడీషీటర్ దౌర్జన్యం చేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన యువతి కుటుంబ సభ్యులను జగన్ కలిసి వారికి భరోసా కల్పించనున్నారు.పార్టీ తరపున బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం కూడా అందించడానికి జగన్ సిద్ధంగా ఉన్నారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఆపై జగన్ గుంటూరు జిల్లాలో యువతి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ప్రత్యేక విమానం ద్వారా వైయస్సార్ కడప జిల్లాకు చేరుకుని కడప విమానాశ్రయం నుంచి నేరుగా బద్వేలులో అత్యాచారం జరిగి, హత్యకు గురైన బాధిత బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు.బద్వేలు లో అత్యాచారానికి గురై హత్య గావించబడిన బాలిక కుటుంబాన్ని రేపు మధ్యాహ్నం జగన్ పరామర్శించి వారికి భరోసా ఇవ్వనున్నారు. ఆపై అక్కడ నుంచి నేరుగా తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో జగన్ పర్యటించనున్నారు ఈ మేరకు జగన్ పర్యటనకు సంబంధించి వైసీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

# ఇండియన్ పెట్రోల్ బ్యాంకులో పంపు బాయిలు ధభాయింపు


- ***గ్రామ పంచాయతీ 10గంటలకే మూత***
- ***100రూపాయలకే పడతాం తరువాత పట్టం***

రాయల్ జర్నలిజం (అన్నమయ్య జిల్లా బ్యూరో) అక్టోబర్ 22:అన్నమయ్య జిల్లా తంబల్లపల్లి నియోజకవర్గ పరిధిలోని బి కొత్తకోట మండల పరిధిలో కాండ్ల మడుగు క్రాస్ లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బాకులో సోమవారం వాహనదారులు 100రూపాయలకె పెట్రోల్ పడతాం రెండు నంబర్ పనిచేయలేదు అన్నారు ఒక వాహనదారుని రెండు వందలకు పట్టు అంటే మేము 100రూపాయలకు మాత్రమే పట్టాలని మేనేజర్ చెప్పాడని వాహణదారులపై ఎవ్వరికీ చెప్పుకుంటావో చెప్పుకో అని వాహన దారుని పై దబాయించారు.ఇది ఇలాఉండగా పెట్రోల్ బ్యాంకు రాత్రి 10గంటలకే మూసేస్తున్నారు అంటూ స్థానికులు వాపోతున్నారు.పెట్రోల్ బ్యాంకు మా గ్రామ సమీపంలో ఉన్న సమయంలో తెరవలేని పరిస్థితి అని మండిపడుతున్నారు.కనీసం




12గంటలవరకైనా తెరవాలని కాకపోతే పర్యాటక కేంద్రం సమీపంలో వున్నదని ప్రజలు అంటున్నారు. దీనిపై అధికారులు యజమాని ఏ విధనంగా వేచి చూడాలి స్థానికులు అంటున్నారు.

# విజయవాడకు ఫ్లడ్ అలర్ట్ జారీ



అమరావతి : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం మరింత బలపడింది. అల్పపీడనంగా మారింది. ఇది వచ్చే 24 గంటల వ్యవధిలో క్రమంగా వాయుగుండంగా అనంతరం అతి తీవ్ర తుఫాన్గా ఆవిర్భవించనుంది.దీని ప్రభావం ఏపీ సహా ఏకంగా మూడు రాష్ట్రాలపై ఉండబోతోంది.దానా తుఫాన్ ఒడిశాలోని పూరీ– పశ్చిమ బెంగాల్లోని సాగర్ ఐలండ్ మధ్య తీరం దాటనుంది. ఆ సమయంలో 120 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయి. ఈదురు గాలుల తీవ్రత 140 నుంచి 160 కిలోమీటర్ల వరకూ పెరిగడానికీ అవకాశం ఉంది. గురువారం అర్ధరాత్రి లేదా శుక్రవారం తెల్లవారు జామున తీరం తాకుతుంది.మొన్నటివరకు దక్షిణ కోస్తా తీర ప్రాంత జిల్లాలు, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య రాయచోటి, చిత్తూరు, తిరుపతి, శ్రీ సత్యసాయి పుట్టపర్తి, అనంతపురం, నంద్యాల జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు దంచికొట్టాయి.అటు కర్ణాటక, తెలంగాణల్లో ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. ఎగువ తీర పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల కృష్ణమ్మ మళ్లీ వరద తాకిడికి గురైంది. భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. తెలంగాణలో ఇందిరా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ నిండిపోయింది.శ్రీశైలం, పులిచింతల, నాగార్జున సాగర్ రిజర్వాయర్లు వరద నీటితో పోటెత్తాయి. నిండుకుండలా మారాయి. ఫలితంగా ఆయా రిజర్వాయర్ల గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు విడదల చేస్తోన్నారు జలమంత్రిత్వ శాఖ అధికారులు.దీని ప్రభావం ప్రకాశం బ్యరేజీపై పడింది. ఇన్ఫ్లో భారీగా ఉంటోంది. దీనితో ప్రకాశం బ్యారేజీకి చెందిన 70 గేట్లను సోమవారమే ఎత్తివేశారు. వరద జలాలను దిగువకు విడుదల చేస్తోన్నారు. తొలి రోజున 1.18 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా.. నేటికి అది రెట్టింపయింది.ఇన్ఫ్లో అధికంగా ఉండటం వల్ల దిగువకు విడుదల చేసే నీటి పరిమాణాన్నీ పెంచారు. ప్రస్తుతం 2.06 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తోన్నారు. దానా తుఫాన్ ప్రభావంతో మరోసారి భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టులకు వరద పోటెత్తే అవకాశం ఉండటం వల్ల ముమ్మందు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు.ఈ నేపథ్యంలో ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు విజయవాడకు ఫ్లడ్ అలర్ట్ జారీ చేశారు. కృష్ణా నది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదల సమయంలో పాటించాల్సినవి/పాటించకూడనివి వివరిస్తూ ఓ ప్రకటనను విడుదల చేశారు.నదిని దాటే ప్రయత్నం చేయకూడదని, వరదనీటిలోకి ప్రవేశంచవద్దని సూచించారు. మురుగు నీటి కాలువలు, కల్వర్టులకు దూరంగా ఉండాలని కోరారు. విద్యుద్ఘాతానికి గురి కాకుండా ఎలక్ట్రికల్ పోల్స్, లైన్లకు దూరంగా ఉండాలని, ఓపెన్ డ్రెయిన్ లేదా మ్యాన్ హోల్స్ కనిపిస్తే ఆ ప్రదేశంలో ఎర్ర జెండాలు లేదా వాటికి అడ్డుగా బారికేడ్లను ఉంచాలని విజ్ఞప్తి చేశారు.


# నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



వయోజన విద్యపై సమీక్షిస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

రాయల్ జర్నలిజం (బాపట్ల) అక్టోబర్ 22: వయోజనులకు విద్యా బోధనతో అక్షరాస్యత శాతం పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. వయోజన విద్యపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని జేసీ చాంబర్లో జరిగింది. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఉల్లాస్ (జీవన పర్యంతరం విద్య అవకాశాలను అందించడం) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని జిల్లా సంయుక్త కలెక్టర్ తెలిపారు. అక్షరాస్యత లేని మహిళలను గుర్తించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 15,268 మంది నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలు, వంటవారు, సహాయకులు, నైట్ వాచ్ మెన్లు, అంగన్వాడి సహాయకులలో గుర్తించి విద్యాభ్యాసం చేయాలన్నారు. ఇదే క్రమంలో విద్యావంతులైన వారిని వాలంటీర్ టీచర్లుగా నియమించాలన్నారు. ప్రతి వాలంటీర్ టీచర్ కు పదిమంది అభ్యాసకులను మ్యాపింగ్ చేసి ఉల్లాస్ యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. వయోజనులకు ప్రతిరోజు సాయంత్రం రెండు గంటల పాటు అక్షరాభ్యాసం చేయాలన్నారు. గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ కేంద్రాలలో విద్యాబాలన జరగాలన్నారు. టీచర్లుగా ఎంపిక చేసిన వాలంటీర్లకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలు జరపాలన్నారు. సామాజిక, ఆర్థిక డిజిటల్ అక్షరాస్యత పెంపొందించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వయోజన విద్య ఉపసంచాలకులు బి జగన్ మోహన్ రెడ్డి, నోడల్ ఆఫీసర్ మధుసూదన్ రావు, డిపిఓ ప్రభాకర్, ఐసిడిఎస్ పిడి ఉమా, డి ఎల్ డి వో సువార్త, పర్యవేక్షకులు కె మనోరంజన్, ఏపిఎం బి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


# నలుగురు ఐఏఎస్‌లకు హైకోర్టు వారెంట్లు.. కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వండి..



అమరావతి : ఆంధ్రప్రదేశ్లో నలుగురు ఐఏఎస్ అధికారులకు బెయిలబుల్ వారెంట్లును ఏపీ హైకోర్టు జారీ చేసింది.. హైకోర్టు ఆదేశాలను అమలు చేయకపోతే కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వాలన్న ఆదేశాలు పాటించకపోవడంతో బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్టు పేర్కొంది.ఐఏఎస్ అధికారులు శశి భూషణ్, రావత్, కృతి శుక్లా, హిమాన్ష్ శుక్లాలకు ఈ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది ఏపీ హైకోర్టు.. ఇక, వారెంట్లు అమలుకు వీలుగా విచారణ నవబర్ 27వ తేదీకి వాయిదా వేసింది.. ఇక, ఆ నలుగురు ఐఏఎస్ అధికారులకు బెయిలబుల్ వారెంట్లు జారీ చేశారు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర్లు.. నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని ఇచ్చిన ఆదేశాలను అధికారులు పాటించక పోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది హైకోర్టు. జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.ఎస్.రావత్, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పై బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.


# ఇండియాలో మోస్ట్ డేంజరస్ ట్రైన్ రూట్... ఒక్కసారైనా జర్నీ చేయాల్సిందే!

అమరావతి : భారతదేశంలో రైలు ప్రయాణం అంటే ఎన్నో అందమైన అనుభూతులను పంచుతుంది. పచ్చటి పొలాల గుండా, ప్రకృతి రమణీయ దృశ్యాలను కనువిందు చేసేలా చూపిస్తూ ఆహ్లాదకరమైన ప్రయాణాన్ని అందిస్తుంది.అందుకే ప్రతి ఒక్కరు రైలు ప్రయాణం అంటే ఎంతో ఆసక్తి చూపిస్తారు. కిటికీ పక్కన కూర్చొని అందమైన దృశ్యాలను తిలకిస్తూ జీవితకాలానికి సరిపడా మధురమైన అనుభూతులను ఇంటికి తీసుకువెళతారు. ఎన్నో అద్భుతాలకు నియలవైన భారతీయ రైల్వేలో అత్యంత ప్రమాదకరమైన మోస్ట్ డేంజరస్ రైలు ప్రయాణం కూడా ఉంది.అత్యంత ప్రమాదకరమైన ఈ రైల్ లైన్ "ది మాథెరన్ హిల్ రైల్వేస్" మహారాష్ట్రలో ఉంది. నెరల్ నుంచి మాథేరన్ వరకు కొంత సమయానికే ప్రయాణిస్తుంది. 20 కిలోమీటర్ల ఈ రైలు మార్గంలో అనేక ప్రమాదకరమైన మలుపులు ఉంటాయి. పశ్చిమ కనుమలకు చెందిన కొండగుండా ఈ రైలు మాథెరన్ హిల్ స్టేషన్ కు చేరుకుంటుంది. ఈ రైలు ప్రయాణాన్ని అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో డ్రోన్ తో వీడియో తీశారు.ఈ మార్గంలో ప్రయాణించే సమయంలో రైల్వే ఒక నిబంధనను విధించింది. రైలు కదిలే సమయంలో ప్రయాణికులు నిలబడకూడదు. ఎందుకంటే కోచ్ ల గురుత్వాకర్షణ శక్తిని మారుస్తుందని, తద్వారా ప్రయాణికులు ప్రమాదానికి గురవుతారని రైల్వే ఈ నిర్ణయం తీసుకుంది. వర్షాకాలంలో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉండటంతో



ఈ మార్గంలో రైళ్ల రాకపోకలను నిషేధిస్తారు.ఈ రైలు మార్గంలో జీవితకాలంలో ఒకసారైనా ప్రయాణించాలి. అత్యంత ప్రమాదకర మలుపులు తిరుగుతూ ప్రయాణికులను తీవ్ర ఉత్కంఠకు గురిచేస్తుంది. రోజూ ప్రయాణం చేసేవారికి అలవాటైనప్పటికీ పర్యాటకులు ఈ రైలు ఎక్కడానికి ప్రతి ఏడాది భారీ సంఖ్యలో వస్తుంటారు. కొత్తగా వచ్చేవారికి మాత్రం ఈ ప్రయాణం చాలా భయాన్ని కలిగిస్తుంది. మీరు కూడా జీవితంలో ఒక్కసారైనా నారెల్–మాథెరన్ రైలు ప్రయాణం చేయండి. జీవితకాలానికి సరిపడా అనుభూతిని సొంతం చేసుకోండి.

# బాలుర,బాలికల కబడ్డీ పోటీలకు భూమి పూజ



రాయల్ జర్నలిజం,రాయచోటి, అక్టోబర్22:అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో మొట్టమొదటిగా జరిగే పాఠశాల క్రీడా సమైఖ్య రాష్ట్ర స్థాయి అండర్–17 బాలుర,బాలికల కబడ్డీ పోటీలను విజవంతం చేయాలనీ మంత్రి సోదరులు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి కోరారు రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి భానుమూర్తి రాజు.రాయచోటిలో ఈ నెల 27,28,29న జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్–17 కబడ్డీ పోటీలకు జిల్లా విద్యా శాఖ అధికారి శివ ప్రకాష్ రెడ్డి,అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్ , జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత కుమారి,జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘా చీఫ్ ప్యాటరాన్ నరసరాజు ,జిల్లా కబడ్డీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరాంజనేయులు తో కలిసి మంత్రి సోదరులు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి,రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి భానుమూర్తి రాజు ప్రభుత్వ హై స్కూల్ వెనుక నున్న మైదానం నందు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సహకరంతో జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటిలలో పాల్గొనే క్రీడా కారులకు అన్ని రకాల వసతులను ఏర్పాటు చేస్తున్నమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా నున్న వ్యాయమ ఉపాధ్యాయ,బోదన ఉపాధ్యాయులు పాల్గొన్నారు...

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# పవన్ కల్యాణ్‌కు కోర్టు సమన్లు

అమరావతి :ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు సమన్లు జారీ చేసింది. తిరుమల శ్రీవారి లడ్డూ విషయంలో పవన్ వ్యాఖ్యలతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని సివిల్ కోర్టులో రామారావు అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో కోర్టు పవన్‌కు సమన్లు జారీ చేసింది. నవంబర్ 22న వ్యక్తిగతంగా హాజరుకావాలని పేర్కొంది.

**ఎందుకంటే..**

కలియుగ దైవం వెంకటేశ్వరుడి లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించిన నెయ్యి కల్తీ జరిగిందని.. అందులో నిషేదిత జంతు కొవ్వు వాడారని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడం కలకలం రేపింది. ఈ క్రమంలో తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. తిరుమల లడ్డూ విషయంలో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలతో కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని న్యాయవాది రామారావు సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయవాది రామారావు పిటిషన్?పై సోమవారం విచారణ చేపట్టిన సిటీ సివిల్ కోర్టు.. ఈ మేరకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్?కు నోటీసులు జారీ చేసింది. తిరుమల లడ్డూ కల్తీ ఇష్యూకు సంబంధించి చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చేందుకు 2024, నవంబర్ 22న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశించింది.

**రుషికొండ భవనాలను పరిశీలించిన పవన్**

విశాఖలోని రుషికొండపై నిర్మించిన భవనాలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిశీలించారు. విశాఖ ఎంపీ భరత్, ఎమ్మెల్యే విజయ్ కుమార్‌తో కలిసి భవన సముదాయాల్లో కలియతిరిగారు. అధికారులను అడిగి ఆ భవనాలకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. కాగా, అంతకముందు విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో డయేరియా పరిస్థితులను పవన్ సమీక్షించిన విషయం తెలిసిందే.


**డయేరియా మృతుల కుటుంబాలకు పవన్ ఆర్థిక సాయం**

విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా మృతుల కుటుంబాలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా రూ.1 లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు. సోమవారం గుర్ల ప్రాథమిక ఆర్యోగ కేంద్రంలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను ఆయన పరామర్శించారు. అతిసార వ్యాప్తి కారణాలపై కలెక్టర్‌తో సమీక్షించారు. గ్రామస్థులతో ముఖాముఖి మాట్లాడారు. విచారణ తర్వాత ప్రభుత్వం నుంచి పరిహారం ప్రకటిస్తామని పవన్ చెప్పారు.

**పింగళి వెంకయ్య పేరు పెట్టడం హర్షణీయం: పవన్**

ఏపీ ప్రభుత్వం మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి, 'పింగళి వెంకయ్య మెడికల్ కాలేజీ'గా పేరు పెట్టడం హర్షించదగ్గ విషయమని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కొనియాడారు. ఈ నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు నాయుడుకి పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం పలు విద్యాసంస్థలకు తమ ఇంట్లో వారి పేరు పెట్టుకుంటే.. తాము మాత్రం దేశ నాయకుల పేర్లు పెడుతున్నామని పేర్కొన్నారు.

# ఇదేందయ్యా ఇది.. ఫేక్ కోర్ట్, ఫేక్ జడ్జి



న్యూఢిల్లీ : ఇప్పటి వరకు మనం చాలానే ఫేక్ ఐపీఎస్, ఫేక్ ఆఫీస్ విషయాలు సంబంధించిన విషయాలను చూసాము. ఇక తాజాగా ఇప్పుడు నకిలీ కోర్టు, జడ్జి గుట్టు బట్టబయలైంది. ఈ కేసులో గుజరాత్ లోని అహ్మదాబాద్‌లో నకిలీ కోర్టు పట్టుబడింది. వృత్తిరీత్యా నకిలీ జడ్జిగా, లాయర్‌గా నటిస్తూ గత కొన్నేళ్లుగా ఈ మోసం వ్యాపారం సాగుతోంది. అసలు విషయం తెలియగానే ప్రజలు షాక్ అవుతున్నారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు నకిలీ న్యాయమూర్తిపై కఠిన చర్యలు తీసుకున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అహ్మదాబాద్ సివిల్ కోర్టు ముందు నకిలీ న్యాయమూర్తి తన నకిలీ కోర్టును నడుపుతున్నాడు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన మోరిస్ శామ్యూల్ క్రిస్టియన్ కోట్ల విలువైన వివాదాస్పద భూములకు సంబంధించిన కేసులో పలు ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో కొన్ని ఉత్తర్వులు డీఎం కార్యాలయానికి చేరాయి. అయితే, అక్కడ దీనికి సంబంధించిన కేసు అహ్మదాబాద్ సిటీ సెషన్స్ కోర్టు న్యాయమూర్తికి చేరడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో రిజిస్ట్రార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం మోరిస్ క్రిస్టియన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నకిలీ ట్రిబ్యునల్‌ను సృష్టించి తనను తాను న్యాయమూర్తిగా చెప్పుకున్నాడు. అహ్మదాబాద్ లోని భదర్ లోని సిటీ సివిల్ అండ్ సెషన్స్ కోర్టు రిజిస్ట్రార్ హార్దిక్ దేశాయ్ నిందితుడు మోరిస్ శామ్యూల్ క్రిస్టియన్‌పై కరంజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన దాఖలు చేసిన ఫిర్యాదులో, నిందితులు ఇతర వ్యక్తులతో కలిసి ఠాకూర్ బాపూజీ ఛనాజీ పేరుతో నేరపూరిత కుట్ర పన్నారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సమాచారం ప్రకారం.. నకిలీ న్యాయమూర్తి మోరిస్ శామ్యూల్ క్రిస్టియన్‌పై ఫిర్యాదు వచ్చినప్పుడు, సిటీ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని చౌతియా పోలీసులను ఆదేశించారు. నకిలీ కోర్టులో ఉంచిన కంప్యూటర్లు, సీపీయూలు, ఇతర పరికరాలను సీజ్ చేయాలని కోర్టు పోలీసులను ఆదేశించింది. దాంతో పోలీసులు తమ చర్యలను ముమ్మరం చేశారు. అహ్మదాబాద్‌లోని నకిలీ కోర్టు బయటపెట్టడంతో.. ఓ ఫేక్ జడ్జి ఏళ్ల తరబడి ప్రజలను ఎలా మోసం చేస్తూనే ఉన్నాడని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.

# భారత అమ్ముల పొదిలోకి ఎస్ఎస్‌బీఎన్ ఎస్-4 అణు జలాంతర్గామి..



విశాఖ: భారతదేశ రక్షణ రంగాన్ని పటిష్టం చేయడంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. విశాఖ సముద్ర తీరంలో అణుసామర్థ్యం కలిగిన ఎస్ఎస్‌బీఎన్ ఎస్-4 అనే నాలుగవ జలాంతర్గామిని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆవిష్కరించినట్లు కథనాలు వెలవడ్డాయి. ఇది బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థ కలిగిన మ్మొట్టమ్మొదటి జలాంతర్గామి కావడం విశేషం. ఇటీవల తెలంగాణలో నేవీ ర్యాడార్ కేంద్రం ప్రారంభించిన మరసటి రోజే అంటే.. అక్టోబర్ 16న విశాఖ షిప్ బిల్డింగ్ సెంటర్‌లో ఎస్ఎస్‌బీఎన్ ఎస్-4 జలాంతర్గామి ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఆగస్టు 29వ తేదీన ఎస్ఎస్‌బీఎన్ అరిఘాత్‌ను విశాఖ కేంద్రంగా రాజ్‌నాథ్ సింగ్ జాతికి అంకితం చేశారు. మరోవైపు అక్టోబర్ 9, 2025న అణుశక్తి కలిగిన మరో జలాంతర్గామిని అరిధామాన్‌ను ప్రారంభించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. కొత్తగా ప్రారంభించబడిన ఎస్ఎస్‌బీఎన్ ఎస్-4ను దాదాపు 75శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేశారు. దీనిలో 3,500 కి.మీ. దూరంలో ఉన్న లక్ష్యాన్ని సైతం ఛేదించేలా కె-4 అణు బాలిస్టిక్ క్షిపణులను అమర్చారు. అయితే మ్మొట్టమ్మొదటి అణు జలాంతర్గామి అయిన ఐఎన్ఎస్ అరిహంత్ కేవల 750కి.మీ. పరిధి లక్ష్యాన్ని మాత్రమే ఛేదించగలదు. దీనిలో కె-15 అణు క్షిపణులు ఉన్నాయి. కొత్తగా మరో అణు జలాంతర్గామి రక్షణ వ్యవస్థలోకి చేరి దేశానికి సేవలు అందించనుంది.

# లోతులో పొరలు.. తీసేందుకు అదిక ఖర్చు



గోదావరిఖని : సింగరేణి గనుల్లోని బొగ్గు పొరలు లోతులో ఉండటంతో వాటిని వెలికి తీసేందుకు సంస్థకు అధిక వ్యయమవుతుంది. ఫలితంగా బొగ్గు ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. దీంతో టన్ను ఉత్పత్తికి ఉపరితల గనుల్లో రూ. 3 వేల వరకు వెచ్చించాల్సి వస్తుంది. మార్కెట్‌లో టన్నుకు రూ.3,500 నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తుంది. అయితే భూగర్భ గనుల్లో ఉత్పతవుతున్న బొగ్గు ప్రతి టన్నుకు రూ.10 వేల వరకు వెచ్చించి.. మార్కెట్‌లో రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకే విక్రయిస్తుంది.

**ఇతర కంపెనీల కంటే ఎక్కువ**

సహజ సిద్ధంగా ఏర్పడ్డ బొగ్గు పొరలు లోతులో ఉండటంతోనే సింగరేణి భారీగా వ్యయం వెచ్చించాల్సి వస్తుంది. దీంతో సంస్థకు ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోవడంతో.. ఇతర కంపెనీల కంటే బొగ్గు ధర ఇక్కడ ఎక్కువగా ఉంటుంది. సింగరేణి పరిధిలో ఉన్న గనుల్లో భూగర్భ పరిస్థితుల ప్రకారం ఒక టన్ను బొగ్గును వెలికి తీయాలంటే ఆరు టన్నుల మట్టిని ఉత్పత్తి చేయాల్సి వస్తుంది.

**36 మిలియన్ టన్నులు వీటికే..**

ఎన్టీపీసీకి రామగుండం ప్రాంతంలోని గనులు, జెన్‌కోకు చెందిన కేటీపీఎస్‌కు కొత్తగూడెం, కేటీపీపీకి భూపాలపల్లి, బీటీపీపీకి మణుగూరు గనులు సమీపంలోనే ఉండటంతో బొగ్గు రవాణా ఛార్జీల భారం లేకుండా పోయింది. సింగరేణి ఏటా ఉత్పత్తి చేస్తున్న 70 మిలియన్ టన్నుల్లో 36 మిలియన్ టన్నుల బొగ్గు వీటికే రవాణా చేస్తోంది. మిగతా బొగ్గు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల్లో ఉన్న విద్యుత్తు కేంద్రాలకు రవాణా చేస్తోంది.

**కలిసివస్తున్న రవాణా భారం**

సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గు ధర ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఇతర కంపెనీల నుంచి రవాణా చేసుకోవడం వినియోగదారులకు భారంగా మారుతుంది. అక్కడి బొగ్గు ధరతోపాటు రవాణా ఛార్జీలు కలిపితే అదే స్థాయిలో ధర అవుతుండటంతో సింగరేణి నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఎన్టీపీసీ, తెలంగాణ జెన్‌కో, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర విద్యుత్తు ఉత్పత్తి సంస్థలు ఎక్కువగా ఇక్కడి బొగ్గును తీసుకుంటున్నాయి. కొన్ని విద్యుత్తు కేంద్రాలకు పిట్‌హెడ్ పరిధిలోనే గనులు ఉండటంతో రవాణా భారం లేకుండా పోతుంది.

**ఇతర రాష్ట్రాల్లో పైపైనే..**

తెలంగాణలో ఉన్న బొగ్గు నిక్షేపాల కంటే ఇతర రాష్ట్రాల్లోని పొరలు తక్కువ లోతులో ఉన్నాయి. ప్రధానంగా ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్‌లోని గనుల్లో.. కేవలం ఒక టన్ను బొగ్గును వెలికి తీయాలంటే రెండు నుంచి మూడు టన్నుల మట్టిని తొలగిస్తే సరిపోతుంది. సింగరేణిలో స్టిప్పింగ్ రేషియో 6 నుంచి 8 వరకు ఉంది. ఇతర రాష్ట్రాల్లో 2.8 నుంచి 3.5 వరకు మాత్రమే ఉంది. దీనివల్ల అక్కడ ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటుంది. బొగ్గు ధర తక్కువగానే ఉంటుంది.

# ఓవైపు బ్రిక్స్ సమావేశం.. మరోవైపు ఐఎంఎఫ్ సమీక్ష.. రష్యాలో మోడీ.. ఆసక్తిరేపుతున్న పరిణామాలు



దిల్లీ: బ్రెజిల్, రష్యా, ఇండియా, దక్షిణాఫ్రికా దేశాల కూటమి బ్రిక్స్ సమావేశం అక్టోబర్ 22న జరుగనుంది. ఈ సమావేశానికి భారత తరఫున ప్రధాని మోదీ హాజరవుతున్నారు. రష్యాలో జరుగుతున్న ఈ సదస్సు ఈసారి ప్రాధాన్యత సంతరించుకుంది. రెండేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధం నేపథ్యంలో రష్యా ప్రతి కదలికను అమెరికా నిశితంగా పరిశీలిస్తోంది. ఈ క్రమంలో బ్రిక్స్ సమావేశం షెడ్యూల్ ఖరారు కాగానే ఐఎంఎఫ్(ప్రపంచ బ్యాంకు) సమావేశానికి అమెరికా చర్యలు చేపట్టింది. ప్రపంచ ఆర్థిక మందగమనంపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. చైనా ఆర్థిక మందగమనం నుంచి జర్మనీ మాంద్యం వరకూ ఇందులో చర్చిస్తారని తెలుస్తోంది. వంద ట్రిలియన్ డాలర్ల ద్రవ్య లోటుపై హెచ్చరించే అవకాశం ఉంది. మాస్కోలో బ్రిక్స్ దేశాల సమావేశం జరుగుతున్న సమయంలోనే ఐఎంఎఫ్ సమావేశం నిర్వహించడం ఆసక్తికరంగా మారింది.

**బ్రిక్స్ ఇలా..**

చాలా ఏళ్ల క్రితం పండితులు బ్రెజిల్, రష్యా, ఇండియా, దక్షిణాఫ్రికాతో కలిసి సైడ్ షో హోదా కోసం కూటమి ఏర్పాటు చేశారు. 2001లో అప్పటి గోల్డ్‌మన్ సాచ్స్ ఆర్థికవేత్త ఓ నీల్ బ్రిక్స్ అనే పదాన్ని ప్రతిపాదించారు. 2010లో ఈ నాలుగు సభ్య దేశాలు దక్షిణాఫ్రికాను చేర్చుకున్నాయి. బ్రిక్స్ సమావేశాలు సాగుతున్న కొద్ది ఒత్తిడి తగ్గిపోయింది. 2019 నివేదికలో స్టాండర్డ్ - పూర్స్ బ్లాక్ ఔచిత్యాన్ని కోల్పోయింది. ఇదే సమయంలో ఓ నీల్ స్వయంగా తన సృష్టిలోని కొన్ని అంశాలను తెలిపారు. 'ఐదు దేశాల దీర్ఘకాలిక ఆర్థిక పథం మళ్లించడం వలన బ్రిక్స్‌ను పొందికైన ఆర్థిక సమూహంగా చూడటం విశ్లేషణాత్మక విలువను బలహీనపరుస్తుంది' అని పేర్కొన్నారు. ఇక 2011 నుంచి ప్రస్తుత దశాబ్దంలో బ్రెజిలియన్, రష్యన్ ఆర్థిక వ్యవస్థల యొక్క స్పష్టమైన నిరాశ ఆధారంగా బహుశా ఐసీ అనే సంక్షిప్త పదాన్ని పిలుస్తాను అని నేను అప్పుడప్పుడు చమత్కరిస్తాను, 2050 దృష్టాంత మార్గంతో పోలిస్తే రెండూ స్పష్టంగా తక్కువ పనితీరును కలిగి ఉన్నాయి అని వెల్లడించారు.

**కొత్తగా ఐదు దేశాలు..**

ఇదిలా ఉంటే.. ఇటీవలే బ్రిక్స్‌లో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌ను చేర్చుకోవాలని నిర్ణయించారు. ఈజిప్ట్, ఇథియోపియాల జోడింపు ఆఫ్రికన్ ఖండం ప్రాధాన్యంతను పెంచుతుంది. ఈజిప్టు చైనా, భారతదేశంతో సన్నిహిత వాణిజ్య సంబంధాలను, రష్యాతో రాజకీయ సంబంధాలను కూడా కలిగి ఉంది. కొత్త సభ్యునిగా, ఈజిప్ట్ మరింత పెట్టుబడిని ఆకర్షించడానికి, దాని దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రయత్నిస్తుంది. అని ఫెర్రాగామో పేర్కొన్నాడు. 'చైనా చాలా కాలంగా ఉప-సహారా ఆఫ్రికాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన ఇథియోపియాను ఆశ్రయించింది, దేశాన్ని దాని బెల్ట్, రోడ్ ఇనిషియేటివ్‌కు కేంద్రంగా మార్చడానికి బిలియన్ల డాలర్ల పెట్టుబడితో ఉంది. సౌదీ అరేబియా, యూఏఈ చేరిక అరబ్ ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలను ప్రపంచవ్యాప్తంగా రెండో, ఎనిమిదో అగ్ర చమురు ఉత్పత్తిదారులను తీసుకువస్తుంది.

# ఉల్లి కోసం స్పెషల్ ట్రైన్



దిల్లీ: ఉల్లి చాలా కాస్ట్లీ గురూ. దేశవ్యాప్తంగా ఉల్లి ధర భగ్గుమంటున్నది. ధరలను నియంత్రించడానికే ప్రభుత్వ రకరకాల ప్రయత్నాలు చేస్తున్నది. ఇందులో భాగంగానే మహారాష్ట్ర నుంచి ఢిల్లీకి ఏకంగా స్పెషల్ ట్రైన్ నడిపింది. తొలిసారిగా మహారాష్ట్ర నుంచి ఢిల్లీకి కాందా ఎక్స్‌ప్రెస్ ఉల్లిని తీసుకెళ్లింది. త్వరలోనే ఇలాంటి ట్రైన్‌లు లక్నో, వారణాసి సహా అసోం, నాగాలాండ్, మణిపూర్ వంటి ఈశాన్య రాష్ట్రాలకు పంపిస్తామని కేంద్రం తెలిపింది. ఉల్లి ధరను నియంత్రించడానికి ప్రభుత్వం 4.7 లక్షల టన్నుల రబీ పంట ఉల్లిని కొనుగోలు చేసింది. ధర పెరుగుతున్నా కొద్దీ కేంద్రం ఉల్లిని విడుదల చేస్తున్నది. సెప్టెంబర్ 5వ తేదీ నుంచి కిలో రూ.35కు ఉల్లిని రిటేల్‌లో అందిస్తున్నది. ఢిల్లీలో ఉల్లి ధర కిలో రూ. 75కు పెరిగింది. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్రలో నాసిక్‌లోని లాసల్‌గావ్ రైల్వే స్టేషన్ నుంచి ఢిల్లీలోని కిషన్‌గంజ్ రైల్వే స్టేషన్‌కు కాందా ఎక్స్‌ప్రెస్‌లో ఉల్లిని తీసుకువచ్చింది. 56 ట్రక్కులకు సరిపడా ఉల్లిని ఈ ట్రైన్ ద్వారా ఢిల్లీకి ఉల్లిని తరలించింది. రోడ్డు ద్వారా తరలిస్తే రూ. 84 లక్షలు అయ్యేదని, ట్రైన్ ద్వారా రూ. 70.20 లక్షలు అయ్యాయని వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖారే తెలిపారు. యూపీ, హర్యానా, మహారాష్ట్ర, ఒడిశా, పంజాబ్, జార?ండ్, తెలంగాణల్లోనూ సెప్టెంబర్ తొలి వారంతో పోల్చితే ఇటీవల ఉల్లి ధరలు తగ్గాయని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది.

# కర్నూల్ జిల్లా కప్పట్రాళ్ల అడవుల్లో అలజడి.. ఏకమవుతున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు



అమరావతి : కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల అడవుల్లో యురేనియం నిల్వలను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్న ప్రచారంతో అలజడి మొదలైంది. కప్పట్రాళ్ల అటవీ ప్రాంతంలో యురేనియం నిక్షేపాలున్నట్లు గుర్తించారు. యురేనియం నాణ్యత అధ్యయనానికి రంగం సిద్ధం చేశారు. యురేనియం నిక్షేపాల పరిమాణం తెలుసుకోవడానికి 'అటామిక్ మినరల్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎండి) అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏడాది కిందటనే ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలతో వాయిదా వేశారు. కప్పట్రాళ్ల అటవీ ప్రాంతం 468 హెక్టార్లలో విస్తరించి ఉంది. నాలుగేళ్ల క్రితమే యురేనియం నిక్షేపాలు ఉన్నట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. 70చోట్ల బోర్ డ్రిల్లింగ్ కు మొదట నిర్ణయించారు. కౌలుట్లయ్య స్వామి ఆలయం ఉండటంతో రెండు చోట్ల బోర్లు డ్రిల్లింగ్ చేయడానికి అటవీశాఖ అనుమతులు నిరాకరించింది. దీంతో 68 చోట్లనే బోర్ డ్రిల్లింగ్ చేయాలని ఏఎండీ అధికారులు నిర్ణయించారు. యురేనియం గుర్తించిన చుట్టుపక్కల కప్పట్రాళ్ల, జిల్లేడుగుడకల, పి. కొటకొండ, మాదాపురం, చెల్లెలచెలిమి, గుండ్లకొండ గ్రామాలున్నాయి. ఆరు గ్రామాల పరిధిలో సుమారు 20వేల మంది జీవనం సాగిస్తున్నారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకొని సుమారు 30వేల ఎకరాల్లో వ్యవసాయ భూములు ఉన్నాయి. యురేనియం తవ్వకాల నిర్ణయంపై గ్రామస్థుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. యురేనియం తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. యురేనియం తవ్వకాలను అడ్డుకొని తీరుతామని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్పష్టం చేశారు. స్థానిక ప్రజలతో సమావేశం నిర్వహించిన సీపీఎం నేతలు.. యురేనియం తవ్వకాలను అడ్డుకుంటామని వెల్లడించారు.

# జమ్మూకశ్మీర్‌లో యాంటీ టెర్రర్ ఆపరేషన్.. కొత్తగా ఏర్పడిన ఉగ్రగ్రూప్ విచ్ఛిన్నం..!



దిల్లీ: జమ్మూకశ్మీర్‌లో పోలీసులు భారీ యాంటీ టెర్రర్ ఆపరేషన్‌ను చేపట్టారు. వరుస సోదాలు నిర్వహించి కొత్తగా ఏర్పాటైన ఉగ్రగ్రూప్ తెహ్రీక్ లబైక్ యా ముస్లింను విచ్ఛిన్నం చేస్తున్నారు. ఇది లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అని, బాబా హమాస్ అనే పాకిస్థానీ వ్యక్తి దాని కార్యకలాపాలు పర్యవేక్షిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గాందర్‌బల్ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడిలో ఏడుగురు మృతి చెందిన నేపథ్యంలో భారీ ఎత్తున సోదాలు జరుగుతున్నాయి. శ్రీనగర్, గాందర్‌బల్, బాందిపొరా, కుల్గామ్, బుద్గాం, అనంత్‌నాగ్, పుల్వామా జిల్లాల్లో ఈ సోదాలు జరిగాయి. తీవ్రవాద కార్యకలాపాల నిమిత్తం ఇటీవల టీఎల్ఎం భారీగా యువతను రిక్రూట్ చేసుకుంటోందని, ఆ వ్యవస్థను నిర్వీర్యం చేయడమే ఆ సోదాల ప్రాథమిక లక్ష్యమని పోలీసు వర్గాలు వెల్లడించాయి. బాబా హమాస్‌కు అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌లతో సన్నిహిత సంబంధాలున్నాయని, చొరబాట్లను ప్రోత్సహించడం, ఆర్థిక వనరులు సమకూర్చడం, టీఎల్ఎంకు యువతను రిక్రూట్ చేసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తున్నాడని పేర్కొన్నాయి. ఇటీవల సోన్‌మార్గ్ వద్ద సొరంగ నిర్మాణ ప్రదేశం వద్ద ఉగ్రవాదులు జరిపిన దాడిలో స్థానికేతర కూలీలు, వైద్యుడితో పాటు ఏడుగురు మృతి చెందారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన బలగాలు ఆ ఉగ్రమూకల కోసం గాలింపు చేపట్టాయి. 'జాతీయ దర్యాప్తు సంస్థ' (ఎన్ఐఏ) అధికారులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దాడి చేసినవారు పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులేనని, వారు ఆ ప్రాంతాన్ని ముందుగానే క్షుణ్నంగా పరిశీలించారని భావిస్తున్నారు. లేదంటే స్థానికులెవరైనా వారికి సహకరించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. కశ్మీర్ గత మూడు దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నా ఈ ప్రాంతంలో ఇలాంటి హింసాత్మక ఘటన జరగడం ఇదే తొలిసారి.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM

# ధాన్యం అందించిన 48 గంటల్లోగా రైతుల ఖాతాలోకి సొమ్ము

## మంత్రి కొలుసు పార్థసారథి తో కలిసి పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్న ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహర్



ఏలూరు,రాయల్ జర్నలిజం, అక్టోబర్ 22 : రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను మద్దత్తు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మరియు జిల్లా ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి తో కలిసి పాత్రికేయుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ర్యాండమైజేషన్ పేరుతో ధాన్యం కొనుగోలులో రైతులను ఎన్నో ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఆనాటి సమస్యలను తెలుసుకుని, అవి పునరావృతం కాకుండా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరిస్తున్నామన్నారు. రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లులకు తమ ధాన్యాన్ని పంపవచ్చని, ధాన్యం రైస్ మిల్లుకు చేరిన 48 గంటలలోగా రైతుల ఖాతాలో సొమ్ము జమ చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలుకు జిల్లాలో 300 వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామని, అవసరమైతే ఏప్రిల్, మొదటి వారం వరకు ధాన్యం సేకరణ చేస్తామన్నారు. రాష్ట్రంలో 52 వేల 700 మెట్రిక్ టన్నుల పీడీఎస్ ధాన్యం అక్రమ రవాణాపై కేసులు నమోదు చేశామని, కాకినాడ పోర్ట్ లో 27 వేల మెట్రిక్ టన్నులు పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి, అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేశామన్నారు. దీపావళి తర్వాత అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రత్యేక ప్రణాళిక రూపకల్పన చేస్తామన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్, కోకో పంటలకు అనుకూలమైన వాతావరణం ఉందని, వాటిని మరింత ప్రోత్సహిస్తామన్నారు. ప్రజల్లో విశ్వాసం కలిగే విధంగా , ముఖ్యమంత్రి పాలనా దక్షతతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళుతున్నారన్నారు. ప్రజలు కోరుకునే విధంగా పాలన చేస్తున్నామన్నారు. పోలవరం నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం తరపున మా వంతు సహకారం అందిస్తామన్నారు. ఏలూరు జిల్లా అద్భుత వనరులు కలిగిన జిల్లా అని, వనరులను సద్వినియోగం చేసుకుని జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. సంక్షేమం విషయంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఫలాలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటుచేస్తామన్నారు. వరదలు, వర్షాల కారణంగా పంటల నష్ట నివారణకు ఒక ప్రణాళిక రూపొందించనున్నామని, జిల్లా అభివృద్ధికి చాలా ఆలోచనలు ఉన్నాయని, ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్తామన్నారు. ఉచిత ఇసుక విధానంలో ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని, ఇందులో ఎలాంటి అవినీతి సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. మహిళలపై జరిగే అరాచకాలను సహించేది లేదని, అటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు అందించిన ఘనవిజయాన్ని బాధ్యతగా భావిస్తున్నామన్నారు. రైతాంగానికి, గ్రామీణ ప్రాంతాల వారికి మేలు చేకూరేలా పల్లె పండుగ కార్యక్రమాలు వ్యవస్థపై నమ్మకం కలిగేలా శాంతి భద్రతల పర్యవేక్షణకు ఆదేశించామన్నారు. అంకిత భావంతో పనిచేసి కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంచుతామన్నారు. ప్రజల్లో విశ్వాసం కలిగే విధంగా , పాలనా దక్షతతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళుతున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేగాన్ని మరింత పెంచేందుకు జిల్లా మంత్రి, ఇంచార్జి మంత్రి, జిల్లా కలెక్టర్, జిల్లాపరిషత్ చైర్ పర్సన్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు,ఎస్పీ, జేసీ లతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేసి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభ స్పీకర్ గా వ్యవహరించారని, ఏ పదవి అలంకరించిన అందుకు వన్నె తెచ్చిన వ్యక్తి నాదెండ్ల మనోహర్ అని కొనియాడారు. ఇన్చార్జి మంత్రి, ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకారంతో జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. ఏలూరు జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య , పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్ కుమార్, చిర్రి బాలరాజు, ప్రభృతులు ఉన్నారు. .

# ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి: షేక్ మౌలానా



మండపేట(రాయల్ జర్నలిజం) : పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలకు డిగ్రీ పూర్తియిన యువత పెద్ద ఎత్తున ఓటు నమోదు చేసుకోవాలని తెలుగుదేశం రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ పారిశ్రామిక వేత్త షేక్ మౌలానా పేర్కొన్నారు. ఓటు నమోదు చేసుకోవాటానికి చివరి తేది నవంబర్ 6 అన్నారు. ఓటు నమోదు చేసుకోవటం, ఓటు వేయటం తమ సామాజిక బాధ్యత అని తెలిపారు. ఫామ్ 18 పూర్తి చేసి, డిగ్రీ ప్రొవిజనల్ (అటెస్టెడ్), ఆధార్ కార్డ్, ఓటర్ ఐడి, పాస్ పోర్టు సైజ్ పోటో జత చేసి మండల రెవెన్యూ కార్యాలయంలో అందచేయాలని కోరారు. గతం లో నమోదు చేసుకున్న వారు కూడా కొత్తగా తిరిగి ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం లో లోకేష్, బాబు ఆధ్వర్యం లో ఆంధ్రప్రదేశ్ యువత కు జాబ్ ఫస్ట్ అనే నినాదంతో ఉద్యోగా కల్పన లక్ష్యంగా కృషి చేస్తున్నారని తెలిపారు. పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించేలా కార్యచరణరూపొందిస్తున్నారని మౌలానా తెలిపారు.

# మద్యం డిస్టలరీలు, బేవరేజెస్ పై దాడులు

## గత ప్రభుత్వంలో కుంభకోణంపై ఆరా



అనపర్తి (రాయల్ జర్నలిజం): రాష్ట్రంలోని పలు మద్యం డిస్టలరీలు,బేవరేజు పై సీఐడీ ఈ ఉదయం నుంచి దాడులు నిర్వహిస్తుంది. వైసీపీ ప్రభుత్వంలో మద్యం విక్రయాల్లోఅవినీతి జరిగిందనే ఆరోపణలపై విచారణలో భాగంగాఈ దాడులు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లాలోనిమద్యం కంపెనీలపై సీఐడీ సోదాలు చేస్తోంది. రంగంపేటమండలం నల్లమిల్లిలోని ఫ్రాగ్ మద్యం పరిశ్రమ, కోటపాడులోని మద్యం బాటిలింగ్ యూనిట్లోనూ సిఐడి సోదాలునిర్వహించారు. అనపర్తి మండలం కొప్పరం శివారులోనిబీడీహెచ్ ఆగ్రో వెంచర్స్‌ప్రైవేటు లిమిటెడ్పరిశ్రమలోసీఐడీ తనిఖీలు చేపట్టింది. సీఐడీ డీఎస్పీ భూపాల్ ఆధ్వర్యంలో ఈ సోదాలు జరుగుతున్నాయి. మద్యం డిస్టలరీలపై ఆకస్మిక దాడులు నిర్వహించి సోదాలు నిర్వహిస్తున్నారు.



మద్యం డిస్టలరీలపై ఆకస్మిక దాడులు నిర్వహించి సోదాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మద్యాన్ని ప్రభుత్వమే విక్రయించడంతో పాటు అక్కడి నుంచే మద్యాన్ని కొనుగోలు చేసింది. మద్యం నాణ్యతపై కూడా ఈ సోదాలు జరుగుతున్నాయి. మద్యం ఆర్డర్, సరఫరా వంటి అంశాలపై డిస్టలరీల వారితో ఆరా తీస్తున్నారు. కొన్ని కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. సిఐడి డిఎస్పి భూపాల్ ఆధ్వర్యంలో సోదాలు చేపట్టిన ఎక్సైజ్ శాఖ, సిఐడిఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు తనిఖీలు నిర్వహించారు.

# పొలం పిలుస్తుంది వ్యవసాయ శాఖ ఏవో గంగాధర్

జీలుగుమిల్లి ,రాయల్ జర్నలిజం, అక్టోబర్ 22 : మండలంలోని తాటి యాకుల గూడెం గ్రామానికి చెందిన రైతు రాయి సుబ్బారావు పొలంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏవో గంగాధరం మాట్లాడుతూ మండలంలోని 12 పంచాయతీల్లో ప్రతి మంగళవారం బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తాం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని ముఖ్య ఉద్దేశం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీలపై అవగాహన కల్పించి జీవామృతం ద్వారా పంటలకు అధిక దిగుబడిని ఇచ్చే విధంగా రైతులకు ఉపయోగపడే సబ్సిడీలను అందించే విధంగా అవగాహన సదస్సును రైతులకు కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ వనమా రాంబాబు ఏఈఓ అగ్రికల్చర్ సచివాలయ సిబ్బంది దుర్గ ,మహేంద్ర డ్రిప్ సుబ్రహ్మణ్యం రైతులకు పాల్గొన్నారు


# అభివృద్ధి బిజెపి కే సాధ్యం

## మండపేటలో సభ్యత్వాలు



మండపేట(రాయల్ జర్నలిజం) : అభివృద్ధి కేవలం బిజెపి కి మాత్రమే సాధ్యమని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కోన సత్యనారాయణ తెలిపారు.మండపేట లో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు.మండపేట 98 వ పోలింగ్ కేంద్రం లో మున్సిపల్ కార్యలయం వద్ద మంగళవారం తాపీమేస్త్రిలకు ఆన్ లైన్ సభ్యత్వాలు నమోదు చేసారు.సందక వీరవెంకట సత్యనారాయణ అద్యక్షతన నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి సాయిరాం ఆద్వర్యంలో సభ్యత్వాలు విస్తృతం గా చేపట్టారు.జిల్లా సభ్యత్వ ప్రముఖ్ కో కన్వీనర్ కోన సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర అద్యక్షురాలు పురందేశ్వరి పిలుపు మేరకు జిల్లా అద్యక్షులు యాళ్ల దొరబాబు సూచనలతో జిల్లాలో సబ్యత్వాలు జోరందుకున్నాయని తెలిపారు.మోదీ పేదలకోసం అనేక సంక్షేమ పథకాలు పెట్టారని పేర్కొన్నారు.రాష్ట్రభివృద్ధికి వేలకోట్ల రూపాయిలు ఇచ్చారని పేర్కొన్నారు .వాటి ద్వారా రాష్ట్రంలో పల్లెలు నుండి పట్టణాలు అభివృద్ధి దిశగా పరుగులు పెడుతున్నాయని కోన తెలిపారు.

# పాస్టర్ల సంక్షేమానికి కృషి: డాక్టర్ డేనియల్ పాల్




మండపేట(రాయల్ జర్నలిజం) : జిల్లా లోని ప్రతీ పేద పాస్టర్ సంక్షేమానికి పాస్టర్ ఫెలోషిప్ కట్టుబడి ఉందని డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పాస్టర్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షులు రెవరెండ్ బిషప్ డాక్టర్ డేనియల్ పాల్ అన్నారు. మండపేట మండలం తాపేశ్వరం లోని జీసస్ క్రైస్ట్ గ్లోరి చర్చ్ లో జరిగిన జిల్లా కమిటీ సర్వ సభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్ లు మాట్లాడుతూ డేనియల్ పాల్ నాయకత్వ పటిమను కొనియాడారు. తామందరికి వెన్నుదన్నుగా నిలుస్తూ జిల్లా వ్యాప్తంగా పాస్టర్ లకు ఆయన అందిస్తున్న సహాయ సహకారాలను విలువకట్టలేమని పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన ఓ ఫెలోషిప్ సభ్యుని భార్యకు 10 వేల రూపాయలను డానియల్ పాల్ సహాయంగా అందించారు. అనంతరం డేనియల్ పాల్ మాట్లాడుతూ గత రెండేళ్లలో రూ 12 లక్షల విలువైన సంక్షేమాన్ని పాస్టర్ లకు వినియోగించినట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రతి పాస్టర్ కు క్రిస్టమస్ ఖర్చులు కింద రు 10 వేలు ఫెలోషిప్ తరుపున అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ సి హెచ్ ధనరాజ్, కోశాధికారి సామ్యేల్ జ్యోతి, కార్యనిర్వహక కార్యదర్శి ఎన్. ప్రభు కుమార్, అదనపు కార్యదర్శి సుందర్ విజయం పాల్గొన్నారు.

# తమ మొక్కు నెరవేరాలని అన్నవరం పాదయాత్ర



మండపేట(రాయల్ జర్నలిజం) మండపేట నియోజకవర్గ అభివృద్ధి కి పాటుబడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సేవలు రాష్ట్ర వ్యాప్తంగా అందించే అవకాశం ఆ భగవంతుడు వేగుళ్ళకు ప్రసాదించాలని కపిలేశ్వరపురం మండలం, వాకతిప్ప గ్రామానికి చెందిన అల్లూరి రామకృష్ణ చౌదరి, చెల్లూరు టీడీపీ గ్రామశాఖ అధ్యక్షులు చంద్రు రాజు, రాయవరం గ్రామ టీడీపీ నాయకులు ఉండవల్లి రాంబాబు లు అన్నవరం శ్రీ సత్యన్నారాయణ స్వామికి మొక్కుకుని మంగళవారం పాదయాత్రగా బయలుదేరారు. తొలుత మండపేట వేగుళ్ళ వీర్రాజు సెంటర్ (కలువపువ్వు సెంటర్) లోని శ్రీ వేంకటేశ్వరస్వామి శ్రీ ఆంజనేయస్వామి ఆలయం లో రామకృష్ణ చౌదరి, చంద్రు రాజు, ఉండవల్లి రాంబాబు లతో కలసి ఎమ్మెల్యే వేగుళ్ళ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ యాత్రను ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. 4 రోజులపాటు సాగే యాత్రలో ఎటువంటి ఆటంకాలు కలగకూడదని ఎమ్మెల్యే ఆ భగవంతున్ని ప్రార్ధించారు. అల్లూరి రామకృష్ణ చౌదరి మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, మండపేట ఎమ్మెల్యే గా వేగుళ్ళ జోగేశ్వరరావు నాల్గవసారి ఘనవిజయం సాధించాలని మొక్కుకున్న మొక్కు నెరవేరటంతో మొదటి సంకల్ప యాత్ర జులై 19 న చేపట్టామన్నారు. మండపేట నుండి తిరుమల కు పాదయాత్ర మొదలుపెట్టి 18 రోజులు అనంతరం అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ని దర్శించుకున్నమన్నారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు నియోజకవర్గ అభివృద్ధి కోసం రాత్రింబవళ్ళు కృషి చేస్తూ ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్న సంధర్భంలో ఆ అమ్మలగన్న అమ్మ విజయవాడ కనక దుర్గమ్మ ఆయనకు ఆరోగ్యం, ఆయుస్సు, ఐశ్వర్యం ప్రసాదించాలని కోరుకుంటూ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పువ్వుల చిట్టిబాబుతో కలసి రెండవ సంకల్ప యాత్ర ఈ నెల 7 వ తేదీన మండపేట నుండి విజయవాడ మొదలుపెట్టి 5 రోజులు పాదయాత్ర చేసి ఆ కనక దుర్గమ్మ ను దర్శించుకున్నమన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కి పాటుబడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ళ సేవలు రాష్ట్ర వ్యాప్తంగా అందించే అవకాశం ఆయనకు కల్పించాలని మనసా వాచా కోరుకుంటూ మూడవ సంకల్ప యాత్ర గా మంగళవారం మండపేట నుండి అన్నవరం శ్రీ సత్యన్నారాయణ స్వామి సన్నిధికి చెల్లూరు టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షులు చంద్రు రాజు , రాయవరం టీడీపీ నాయకులు ఉండవల్లి రాంబాబు తో కలసి పాదయాత్ర గా అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి వారి దర్శనానికై బయలుదేరుతున్నామని రామకృష్ణ చౌదరి అన్నారు. ఈ కార్యక్రమంలో కపిలేశ్వరపురం మండల అధ్యక్షులు ముత్యాల వెంకట్రావు, బీజేపి జిల్లా ఉపాధ్యక్షులు కోన సత్యనారాయణ, టీడీపీ నాయకులు నూని ఏసుబాబు, మార్ని రామకృష్ణ, కర్రి తాతరావు, వాకతిప్ప ఎంపిటిసి ప్రసన్న కుమార్, తదితర్లు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడు, కవి,డాక్టర్ పోచిరాజు శేషగిరి రావు చిరస్మరణీయుడు



అనపర్తి (రాయల్ జర్నలిజం): అనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు భాషాభి మానుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన 1948 58 మధ్య కాలంలో ఈ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసిన కీర్తి శేషులు డాక్టర్ పోచిరాజు శేషగిరి రావు శతజయంతి సభ ఘనంగ నిర్వహించరు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన నారాయణ రెడ్డి కంటి ఆసుపత్రి అధినేత ప్రముఖ వైద్యులు తేతలి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆనాటి కాలంలో శేషగిరి రావు వంటి వారి దగ్గర మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ తేతలి రామారెడ్డి, కవి సత్తి హనుమంత రెడ్డి వంటి వారు శిష్యులు అని, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి ఉపాధ్యాయుడుగా, కవి గా డాక్టర్ పోచిరాజు శేషగిరి రావు చిరస్మరణీయుడు అని తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులగం వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో మరో అతిథిగా వచ్చిన ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ రామగురెడ్డి మాట్లాడుతూ శేషగిరిరావు మాస్టారు ఈ ఉన్నత పాఠశాలలో గురువుగా పనిచేసిన ఇదే పాఠశాలలో నేను చదువుకున్నందుకు ఎంతో గర్వపడుతున్నానని అన్నారు. ప్రత్యేక అతిథిగా వచ్చిన రిటైర్డ్ తహసీల్దార్ గౌరీ నాయుడు డాక్టర్ పోచిరాజు శేషగిరి రావు గారు 1924 లో కోనసీమ లో జన్మించారని,అనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో 1947 నుండి 1958 వరకు తెలుగు మాష్టారుగా పనిచేశారని, తదుపరి వివిధ చోట్ల పనిచేసి తరువాత పెద్దాపురం మహారాణీ కళాశాల లో తెలుగు లెక్చరర్ గా, తెలుగు శాఖ అధిపతిగా, కొంతకాలం ఆర్ట్స్ క్యాంపస్ ఇంచార్జి ప్రిన్సిపాల్ గా పనిచేశారని, వారు ప్రముఖ పద్యకవిగా రెండు రాష్ట్రాలలో వినుతికెక్కారని, బహు కావ్యాలు రచించిన మహానుభావుడని ఆయన గురించి అద్భుతంగా వివరించారు.అనంతరం వైద్యులు సత్యనారాయణ రెడ్డి , రామగురెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త మేడపాటి చెల్లారెడ్డి, రిటైర్డ్ తహసిల్దార్ గౌరీ నాయుడులను తెలుగు భాషాభిమానులు సంఘం సాదరంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్ పర్సన్ లు పార్వతి , రాజేశ్వరి,భాషాభిమానులు వైబిఎస్ ఆచార్యులు, రవి కిషోర్, విను రెడ్డి , చావల శ్రీనివాస్ , ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఉపాధ్యయేతర సిబ్బంది మరియు విద్యార్థిని



# ఆర్టీసీ ప్రయాణం... సురక్షితం

## - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హితవు

## - రాజమండ్రి - విశాఖపట్నం నూతన బస్సు సర్వీస్ ప్రారంభం




రాజమహేంద్రవరం,రాయల్ జర్నలిజం, అక్టోబర్ 22 : ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ ఎప్పుడు ముందుంటుందని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నందు రాజమండ్రి - విశాఖపట్నం నూతన బస్సు సర్వీస్ ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఆర్టీసీ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ వ్యవస్థ అంటే ఒక నమ్మకమని, ప్రజలను తమ యొక్క గమ్య స్థానాలకు సురక్షితంగా తీసుకువెళ్లే వ్యవస్థ ఏదైనా ఉందంటే అది ఆర్టీసీ అని తెలియజేశారు. ఆర్టీసీ భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఎప్పటికప్పుడు తమ సేవలను విస్తరిస్తూ ప్రయాణికుల ప్రయాణికుల మన్ననలు పొందుతూ ముందుకెళుతుందన్నారు.భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ఆర్టీసీ కార్యాచరణను కొనసాగిస్తూ ముందుకు వెళుతూ ప్రజలకు ఉత్తమమైన సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు మేరకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తమ బాధ్యతలను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికీ ఉచిత ఇసుక పాలసీని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాలను ప్రజలకు అందించడం జరిగిందన్నారు. తమ కూటమి ప్రభుత్వం మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసిరెడ్డి బాబీ, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ ఇచ్చిన మూడు హామీలే ఆయనకి నిద్ర లేకుండా చేస్తున్నాయా.!



అమరావతి : ఐదేళ్ల పాటు ఏపీకి ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ ఇప్పుడు కనీసం ప్రతిపక్షంలో కూడా లేకుండా పోయాడు. ఆయన ఇచ్చిన హామీలు ఏవి అమలు చేయకపోవడంతో జగన్ కి ఈ సారి అధికారం అందించలేదు ఏపీ ప్రజలు.దీంతో వచ్చే ఏడాది అయిన అధికారం దక్కించుకోవాలనే కసితో ఆయన ఉన్నారు. అయితే గతంలో జగన్ ఇచ్చిన హామీలు సరిగ్గా నెరవేర్చలేదనే టాక్ ఇప్పుడు ఉంది. దీంతో జగన్ మళ్లీ అధికారంలోకి రాగలడా అని కొందరి నుండి వస్తున్న ప్రశ్న. మరి అమలు పరచని హామీలకి జగన్ ఎలాంటి సమాధానం ఇస్తాడు, వారిని ఎలా కూల్ చేస్తాడు, వెళ్లిపోయిన నాయకులని మళ్లీ తన దగ్గరకి ఎలా తెచ్చుకుంటాడు అనేది పెద్ద ప్రశ్నగా మారింది.2019 ఎన్నికలప్పుడు ఇచ్చిన మేనిఫెస్టోను 99 శాతానికి పైగా పూర్తిచేశానని జగన్ చెప్పగా, సీపీఎస్ రద్దు, పోలవరం, మద్య నిషేధం, ప్రత్యేకహోదా సాధన, మెగా డీఎస్సీతో సహా వైఎస్ ప్రారంభించిన జలయజ్ఞం పూర్తి ఇలా చెప్పుకుంటూ పోతే పూర్తికానివి ఎన్నో ఉన్నాయి. అయినా 99 శాతానికి పైగా హామీలు అమలు చేశానని ఎంత పచ్చిగా అవాస్తవాలు వల్లెవేశారంటూ ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. మెగా డీఎస్సీ. ఇది లక్షలాది మంది నిరుద్యోగులకు కలలు రేపిన జగన్ కీలక హామీ. 2019లో అధికారంలో రాగానే నెరవేరుస్తానన్న హామీ. కానీ, ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా వేయలేకపోయారు. సీపీఎస్ రద్దు అనేది ఉద్యోగులకు సంబంధించిన కీలక హామీ. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 4 లక్షల మంది ఉద్యోగులకు సంబంధించి సీపీఎస్ రద్దుపై కూడా జగన్ హామీ ఇచ్చారు.విడతల వారీగా మద్య నిషేధం ఎవరు కోరని హామీ. కాని ఆయనే ఈ హామీని ఇచ్చారు.దీనిని నెరవేర్చకపోగా.. నాసిరకం మద్యం విక్రయించారు. ఇది మందుబాబులకే కాదు.. వారి భార్యలకు కూడా కోపం తెప్పించింది. సో.. ఈ మూడు హామీలు జనాలు మరిచిపోలేదు. కాబట్టి ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా.. జగన్‌కు ఈ మూడు హామీల సెగలు తగులుతూనే ఉంటాయని అంటున్నారు. చూడాలి మరి జగన్ వాటిని ఎలా మేనేజ్ చేసి తిరిగి మళ్లీ పూర్వ వైభవం ఎలా సంపాదిస్తాడు అనేది.

# జవాన్‌కు అశ్రునయనాల నడుమ వీడ్కోలు




బ్రహ్మంగారిమఠం: చత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ ప్రాంతంలో మావోయిస్టుల అమర్చిన ఐఇడి పేలి తోట్లపల్లి పంచాయతీలోని పాపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొడవటికంటి రాజేష్ వయస్సు(36) మతి చెందాడు.చత్తీస్‌గడ్ నుంచి ఆదివారం రాత్రి జవాన్ మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. సోమవారం పాపిరెడ్డిపల్లిలో అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. కార్యక్రమానికి ఐటిబిపి డిప్యూటీ కమాండర్ తేజ్‌వీర్‌సింగ్, సుబేదార్ మేజర్ హరివిందర్‌సింగ్ రాథోడ్, ఇన్‌స్పెక్టర్ జీప్ సింగ్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఓమ్‌ప్రకాష్‌తోపాటు 16 మంది జవాన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జవాన్‌లు గ్రామంలో కవాతు నిర్వహించారు.రాజేష్ మృతదేహం వద్ద మూడు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపి పోలీస్ వందనంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఐటిబిపి నుంచి జవాన్ కుటుంబానికి రూ.35 లక్షలు వరకు పరిహారం అందనుంది. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.కోటి ప్రకటించింది. జవాన్ మృతదేహానికి కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జవాన్ రాజేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాశానని చెప్పారు. ప్రభుత్వం నుంచి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని, కుటుంబ పోషణకు జవాన్ సతీమణి స్వాతికి మానవతా దృక్పథంతో ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని లేఖలో పేర్కొనట్లు తెలిపారు. జవాన్‌కు నివాళులర్పించిన వారిలో బద్వేల్ ఆర్‌డిఓ చంద్రమోహన్, మాజీ మంత్రి డి.ఎల్.రవీంద్రారెడ్డి, తహశీల్దార్ దామోదర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ జాన్సన్, మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్, బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్, టిడిపి, వైసిపి నాయకులు, సర్పంచులు ఉన్నారు.

# భారత్‌లోనే ఉంటాను.. అనుమతించండి : తస్లీమా నస్రీన్



న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ నుంచి బహిష్కరణకు గురైన వివాదాస్పద రచయిత్రి తస్లీమా నస్రీన్ భారత్‌ను తన రెండో పుట్టినింటిగా అభివర్ణించారు. భారత్‌ను తాను ప్రేమిస్తానని, ఇక్కడ నివసించే అవకాశాన్ని తనకు కల్పించాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరుతూ ఆమె 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు.గత 20 ఏళ్లుగా తనకు సురక్షితమైన ఆశ్రయం కల్పిస్తూ రెండో పుట్టినింటిగా భారత్ నిలుస్తోందని తస్లీమా గుర్తు చేశారు.అయితే తన నివాస అనుమతుల గడువును జులై 22 నుంచి భారత హోంశాఖ పొడిగించకపోవడం కొంత ఆందోళన కలిగిస్తోందని ఆమె చెప్పారు. తన రెసిడెన్స్ పర్మిట్‌ను పొడిగిస్తే సంతోషిస్తానన్నారు. 'లజ్జ' టైటిల్‌తో తస్లీమా నస్రీన్ రచించిన నవల వివాదానికి దారితీసింది. బంగ్లాదేశ్‌లోని మతఛాందస వాదుల నుంచి ఆమెకు బెదిరింపులు వచ్చాయి. దీంతో తస్లీమా 1994లో భారత్‌కు వచ్చారు. నాటి నుంచి ఇక్కడే ఉంటున్నారు.

# నాడు రూ.70.. నేడు రూ.30! పానకాలరాయుని పానకం ధరలో భారీ మార్పులు



మంగళగిరి: 'మన మంగళగిరి.. మన లోకేశ్' ట్యాగ్‌ను మంత్రి నారా లోకేశ్ సార్థకం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. దక్షిణ భారత దేశంలోనే పేరుగాంచిన మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఎగువ సన్నిధిలో టెండర్ ముసుగులో నాసిరకం పానకం, భక్తుల నిలువు దోపిడీకి ఆయన ముగింపు పలికారు.సోమవారం నుంచి పానకం తయారీకి మంగళగిరి అక్షయపాత్ర ప్రతినిధి రఘునందనదాస పూజలు నిర్వహించి ప్రారంభించారు.

**తయారీ బాధ్యతలు ఇస్కాన్ కు..**


ఇక నుంచి నాణ్యమైన బిందె బెల్లం పానకం రూ.30, పట్టిక బెల్లం పానకం రూ.35కు అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో టెండర్ ముసుగులో నాణ్యత లేని నాసిరకం పానకానికి రూ.70 వసూలు చేసేవారు. భక్తుల దోపిడీని గుర్తించిన లోకేశ్.. ప్రత్యేక శ్రద్ధ పెట్టి, భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. ఆధ్యాత్మిక భావన, సేవా దృక్పథంతో వ్యవహరించే ఇస్కాన్‌కు పానకం బాధ్యతలు అప్పగించడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మహిళలకు సీఎం చంద్రబాబు దీపావళి కానుక.. కొత్త పథకానికి శ్రీకారం



అమరావతి : ఏపీలో మరో సంక్షేమ పథకం అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దీపావళి కానుకను అందించనున్నారు.ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్-6లో భాగమైన ఉచిత సిలిండర్ల పథకానికి సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ప్రకటించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ నెల 31వ తేదీ నుంచి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ప్రకటించారు. ఏడాదికి రూ.2,684 కోట్లతో ఖర్చుతో ఉచిత సిలిండర్ల పథకానికి సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. మహిళా సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని దీపం పథకం గొప్ప ముందడుగు అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి బుకింగ్ చేసుకునే ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సిలిండర్ తీసుకున్న 2 రోజుల్లో వారి బ్యాంకు ఖాతాల్లో గ్యాస్ సబ్సిడీ చేయాలని సీఎం సూచించారు.దీపం పథకం ఈ దీపావళి పండుగతో ఇళ్లల్లో వెలుగులు తెస్తుందన్నారు. దీపం పథకం అమలు, విధివిధానాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఆర్థిక సమస్యలు ఉన్నా.. పేదలకు మేలు చేసే సంక్షేమ పథకాలు విషయంలో ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు. ఈ నెల 31 తేదీన దీపావళి పథకం ప్రారంభించాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో అర్హులైన మహిళలందరికీ పారదర్శక విధానంలో ఈ ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఎల్పీజి గ్యాస్ కనెక్షన్ కలిగి, అర్హతగల ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. ప్రతి నాలుగు నెలల వ్యవధిలో ఎప్పుడైనా ఆయా లబ్దిదారు ఒక ఉచిత గ్యాస్ సిలిండర్ పొందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహిళలకు ఇంటి ఖర్చులు తగ్గించాలనే ఆలోచనతో ఉమ్మడి రాష్ట్రంలో దీపం పథకం వచ్చిందన్నారు. గ్యాస్ సిలిండర్ రిటైల్ మార్కెట్ ధర రూ. 876లు కాగా కేంద్ర ప్రభుత్వం ప్రతి సిలిండర్ కు 25ల సబ్సిడీ ఇస్తుండగా.. ప్రస్తుతం ప్రతి సిండర్ ధర రూ.851గా ఉందన్నారు. ప్రభుత్వంపై 2 వేల 684 కోట్ల అదనపు భారం పడుతుందని.. ఐదేళ్ళకు కలిపి 13వేల 423 కోట్ల అదనపు భారం పడుతుందన్నారు.

# భారత్‌కు మరోసారి పాక్ అణుబాంబు బెదిరింపు.. భారత్‌లో ప్రతి మూలను నాశనం చేస్తాయని హెచ్చరిక



న్యూఢిల్లీ : ఆసియా దేశాలైన భారత దేశం, పాకిస్థాన్ దేశం అణ్వాయుధాలు కలిగిన దేశాలు. అణ్వాయుధాలు కలిగి ఉన్నప్పటికీ భారతదేశం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంది. అందుకు విరుద్ధంగా పాకిస్తాన్ సైన్యం.ఆ దేశ ఆర్మీ ఉన్నతాధికారులు మాత్రం నిరంతరం అణ్వాయుధ బెదిరింపులను జారీ చేయడంలో నిమగ్నమై ఉన్నారు. పాకిస్థాన్ ఆర్మీ మాజీ లెఫ్టినెంట్ జనరల్ ఖలీద్ అహ్మద్ కిద్వాయ్ మరోసారి భారత్‌ను అణ్వాయుధాలు ఉన్నాయని.. జాగ్రత్తగా ఉండాలంటూ బెదిరించారు. పాకిస్థాన్ వద్ద అన్ని రకాల అణ్వాయుధాలు ఉన్నాయని.. వాటితో భారత్‌ను ఏ మూలనైనా లక్ష్యంగా చేసుకుని దాడులు చేయవచ్చు అని అన్నారు. అయితే తాము అణ్వాయుధాలతో దాడులు చేస్తే భారతదేశం వద్ద S-400 వైమానిక రక్షణ వ్యవస్థ కూడా ఏమీ చేయలేదని హెచ్చరించారు. కిద్వాయ్ పదవీ విరమణ తర్వాత కూడా.. పాకిస్తాన్ సైన్యంతో అనుబంధం కలిగి ఉన్నాడు. ప్రస్తుతం ఆయన పాకిస్తాన్ అణు బాంబులను పర్యవేక్షించే సంస్థ అయిన నేషనల్ కమాండ్ అథారిటీకి సలహాదారుగా ఉన్నారు. అణుబాంబు విషయంలో పాకిస్థాన్‌కు 'నో ఫస్ట్ యూజ్' విధానం లేదని కొద్ది రోజుల క్రితం కిద్వాయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.ఇటీవల జరిగిన ఇస్లామాబాద్ నాన్-ప్రొలిఫరేషన్ కాన్ఫరెన్స్ 2024లో కిద్వాయ్ మాట్లాడుతూ భారతదేశానికి ఈ హెచ్చరిక చేశారు. ఈ సదస్సుకు పాకిస్థాన్ ఆర్మీ ఛైర్మన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ జనరల్ సాహిర్ షంషాద్ మీర్జా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లెఫ్టినెంట్ జనరల్ కిద్వాయ్ 1998 తర్వాత పాకిస్థాన్‌లో అణు నిర్వహణకు సంబంధించి తన ప్రసంగంలో పాకిస్థాన్ రహస్యంగా అణు కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. ఇది 1972లో ప్రారంభమైంది. అయితే భారతదేశానికి వ్యతిరేకంగా ప్రయోజనం పొందేందుకు 1998లో ఈ విషయాన్నీ ప్రపంచానికి తెలియజేశారు. అంతేకాదు కాన్ఫరెన్స్ లో కిద్వాయ్ భారత అణుపరీక్ష గురించి కూడా ప్రస్తావించారు.

**'భారతదేశంలోని ప్రతి మూలలో దాడి చేయగల సామర్థ్యం'**

1998లో మే నెలలో పాకిస్థాన్‌లో సమర్థవంతమైన న్యూక్లియర్ కమాండ్ అండ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఏర్పడిందని లెఫ్టినెంట్ జనరల్ కిద్వాయ్ చెప్పారు. ఇది తమకు వ్యూహాత్మక నిరోధక సామర్థ్యానికి నమ్మకమైన స్థిరత్వాన్ని అందించిందని వెల్లడించారు. పాకిస్థాన్‌కు ఇప్పుడు పెద్ద ఎత్తున అణు నిరోధక సామర్థ్యం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇది అణు దాడికి ముందు, అణుదాడి అనంతరాం తిరిగి దాడి చేయగల సామర్థ్యాన్ని పాకిస్తాన్‌కు అందించిందని చెప్పారు. ఈ అన్వాయుధాల వలన శత్రువుల దాడికి వ్యతిరేకంగా సమర్థవంతమైన ప్రతిఘటనను చేయగలమని చెప్పారు.పాకిస్థాన్ సైనిక అధికారి పాకిస్థాన్ అణ్వాయుధ నిరోధక సామర్థ్యం గురించి కూడా బహిరంగంగా మాట్లాడారు. నిరోధక సామర్థ్యంలో వ్యూహాత్మక, కార్యాచరణ, వ్యూహాత్మక అణు బాంబులు మూడింటిని కలిగి ఉంటాయని కిద్వాయ్ చెప్పారు. భారతదేశంలోని ప్రతి మూలపై దాడి చేయగల సామర్థ్యం కూడా తమ వద్ద ఉన్న అణుబాంబుల్లో ఉన్నాయని హెచ్చరించారు. అదే సమయంలో భారతదేశంలో ఎక్కడా వ్యూహాత్మక ఆయుధాలను దాచే అవకాశం లేదని.. పాకిస్థాన్ వద్ద అన్ని రకాల అణ్వాయుధాలు ఉన్నాయని చెప్పారు. శత్రువుల భీకర ఎదురుదాడి వ్యూహం విఫలమయ్యేలా చేసే ఆయుధల సంఖ్య బాగానే ఉందని .. తమపై దాడి చేస్తే.. అందుకు ప్రతీకారం తీర్చుకుంటూ పాకిస్థాన్ చేసే భీకర ప్రతీకార దాడి భయంకరంగా ఉంటుందని చెప్పారు.

# మంగళవారం బ్రేక్ తీసుకున్న గోల్డ్..దీపావళి షాపింగ్ సందడి మొదలెడదామా?



అమరావతి : ప్రస్తుతం అంతర్జాతీయంగా పసిడి ధరలు ఆల్ టైమ్ గరిష్ఠాలకు చేరుకుని సామాన్యులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ఈ క్రమంలో నేడు గోల్డ్ ధరలు పెరుగుదలకు చిన్న బ్రేక్ తీసుకున్నాయని తెలుస్తోంది.అయితే భారీగా పెరిగిన ధరల వల్ల ఈ ఏడాది పండుగకు అమ్మకాలు 10 శాతానికి పైగా తగ్గవచ్చని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నేటి తాజా ధరలను దేశీయంగా చూస్తే.22 క్యారెట్ల పసిడి ధర నిన్నటితో పోల్చితే నేడు స్థిరంగా కొనసాగుతున్నాయి. దీంతో దేశంలోని వివిధ నగరాల్లో నేటి రిటైల్ గోల్డ్ విక్రయ ధరలను పరిశీలిస్తే.. గ్రాముకు చెన్నైలో రూ.7300, ముంబైలో రూ.7300, ఢిల్లీలో రూ.7315, కలకత్తాలో రూ.7300, బెంగళూరులో రూ.7300, కేరళలో రూ.7300, వడోదరలో రూ.7305, జైపూరులో రూ.7315, పాట్నాలో రూ.7305, మంగళూరులో రూ.7300, నాశిక్ లో రూ.7303, అయోధ్యలో రూ.7315, బళ్లారిలో రూ.7300, గురుగ్రాములో రూ.7315, నోయిడాలో రూ.7315 వద్ద విక్రయాలు కొనసాగుతున్నాయి. అయితే ఈ రేట్లు జీఎస్టీ, పసిడి విక్రయదారుల లాభాలు, తరుగు మజూరి వంటి ఖర్చులకు ముందు రేటుగా గుర్తుంచుకోవాలి.ఇదే క్రమంలో 24 క్యారెట్ల పసిడి ధర 100 గ్రాములకు నేటి రిటైల్ విక్రయ ధరలను పరిశీలిస్తే.. గ్రాముకు చెన్నైలో రూ.7964, ముంబైలో రూ.7964, ఢిల్లీలో రూ.7979, కలకత్తాలో రూ.7964, బెంగళూరులో రూ.7964, కేరళలో రూ.7964, వడోదరలో రూ.7969, జైపూరులో రూ.7979, పాట్నాలో రూ.7305, మంగళూరులో రూ.7964, నాశిక్ లో రూ.7967, అయోధ్యలో రూ.7979, బళ్లారిలో రూ.7964, గురుగ్రాములో రూ.7979, నోయిడాలో రూ.7979గా ఉన్నాయి.ఏపీ-తెలంగాణలోని నగరాలైన విజయవాడ, గుంటూరు, కాకినాడ, తిరుపతి, నెల్లూరు, అనంతపురం, గుంటూరు, కడప, విశాఖలో గ్రాము ధర రూ.7300గా ఉండగా.. 24 క్యారెట్ల ధర రూ.7964 వద్ద ఉంది. ఇదే క్రమంలో హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్, నిజాంబాద్, వరంగల్ నగరాల్లో 22 క్యారెట్ల పసిడి నేటి ధర రూ.7300గా ఉండగా.. 24 క్యారెట్ల ధర రూ.7964 వద్ద కొనసాగుతోంది. అలాగే తాజా వెండి ధరలను తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ విక్రయ ధరను పరిశీలిస్తే.. ధర కేజీకి రూ.1000 పెరిగి నేడు రూ.1,10,000 వద్ద విక్రయాలు జరుగుతున్నాయి.

**ధనత్రయోదశి ఎప్పుడు..**

హిందువులు ఎక్కువగా ధనత్రయోదశిని ఘనంగా జరుపుకుంటుంటారు. దీపావళికి ముందు ధన్‌తేరస్ పేరుతో నిర్వహిస్తుంటారు. ఏటా ఆశ్వయుజ మాసంలోని కృష్ణ పక్షం త్రయోదశి నాడు జరుపుకుంటుంటారు.

# రూ. 10 కాయిన్‌పై ఇండియన్ బ్యాంక్ కీలక ప్రకటన..



అమరావతి : రూ. 10 కాయిన్ ఇస్తే ఇప్పటికీ తీసుకోవడానికి వెనుకడుగు వేసే వారు చాలా మంది ఉన్నారు. కాయిన్ చెల్లదంటూ ఓ ప్రచారం జరుగుతూనే ఉంది. ఇప్పటి వరకు ఈ కాయిన్‌కు చెల్లదని ఆర్బీఐ అధికారికంగా ఎప్పుడూ ప్రకటించలేదు.అయితే ప్రజల్లో మాత్రం ఓ అపోహ మాత్రం ఉంటోంది. అయితే రూ. 10 కాయిన్ తీసుకోవడాన్ని నిరాకరిస్తే నేరంగా పరిగణించాలని ఇప్పటికే ఆర్బీఐ ప్రకటన చేసిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలోనే తాజాగా రూ. 10 నాణేలపై ఇండియన్ బ్యాంక్ అవగాహన కార్యక్రమం చేపట్టింది. ఈ కాయిన్స్ చట్టబద్ధమైనవని, వీటిని రోజువారీ లావాదేవీలకు ఉపయోగించవచ్చని ఇండియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. వీటి చలామణిని వ్యాపార లావాదేవీలకు ఉపయోగించాలని , ఆర్బీఐ ఉత్తర్వుల మేరకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఇండియన్ బ్యాంక్ చర్యలు చేపడుతోందని చెప్పుకొచ్చారు.ఇందులో భాగంగానే ఇటీవల హైదరాబాద్ హిమాయత్ నగర్ బ్రాంచ్ వద్ద 10 రూపాయల నాణేలు చలామణిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తమ ఖాతాదారులకు 10 రూపాయల నాణేలు వినియోగించాలని సూచిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ఈ నాణేలు చెల్లుబాటు అవుతున్నాయని తెలిపారు. కాగా ఈ సందర్భంగా పలువురు ఖాతాదారులు ఈ నాణేలను జీఎం చేతుల మీదుగా అందుకున్నారు. దీంతో రూ. 10 నాణేంపై జరుగుతోన్న అపోహలకు చెక్ పెట్టినట్లు అయ్యింది.ఇదిలా ఉంటే ఇప్పటికీ చాలా మంది రూ. 10 నాణేలను తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వీటిపై సరైన అవగాహన ఉండడం లేదు. దీంతో ఈ కాయిన్స్ చెల్లవన్న అనుమానంతో తీసుకోవడం లేదు.

# J&K attack caught intel agencies unawares

Central intelligence agencies had no clue that terrorists could strike at the Z-Morh tunnel construction site in Jammu and Kashmir's Ganderbal district, the first such attack on a strategic infrastructure project in the region.People familiar with the development said The Resistance Front (TRF), a proxy of the Lashkar-e-Taiba (LeT), has claimed responsibility for the attack, in which six construction workers and doctor were killed.However, a senior intelligence officer said, "This is a well thought out attack on a strategic project of India. A terror-group like TRF is not capable of getting details of such a crucial project unless it is assisted by a state agency," referring to Pakistan's Inter Services Intelligence."The National Investigation Agency will look into all these aspects as part of its larger conspiracy probe," the officer added, admitting there was no intelligence regarding such an attack.Explaining the strategic importance of the Z-Morh tunnel, a second officer said the 6.4 km-long tunnel on the Srinagar-Leh highway, which connects Gagangeer to Sonmarg, will ensure all-weather access to Sonmarg and connectivity to Ladakh, important for movement of defence personnel and equipment in the border areas."Having failed to create unrest in J&K due to security forces' alertness, there seems to be attempt to target key projects," the second officer said.

## Sanjay Raut meets Shah, denies joining hands with BJP



MUMBAI: Gripped by a fear of loss in its seat-share talks with Congress a day after letting it be known that it was nursing extreme ideas about its MVA association in Maharashtra, Uddhav Thackeray's Shiv Sena appeared to move back from the brink.Then, on Monday, it turned to BJP to reinforce its MVA cover with Sanjay Raut going some length to dismiss his reported meeting with Union minister Amit Shah.Raut said joining hands with BJP meant joining the ranks of Aurangzeb and Afzal Khan (medieval Mughal royalties). Before it came to that, speculation swirled around that Congress and Shiv Sena (UBT) would part ways over seat-sharing differences and that Raut-Shah "meeting" was meant to explore various options."The BJP not only toppled the Uddhav Thackeray-led government but also broke the party founded by late Balasaheb Thackeray, snatching the party's symbol. How could rumour-mongers even imagine us going with the BJP," asked Raut.He said BJP cheated Uddhav and gave the state to the "traitors." "We fought very hard with BJP and its tyranny. How can such people ever forget the pain that they inflicted on our leader? I was sent to jail for no charges. We're not the ones who can betray," said Raut. "Shiv Sena (UBT) is the party of self-respecting people. If we want to do something, we'll do it openly," said Raut.He said people were deliberately spreading rumors to defame our party and widen the gap among MVA alliance partners. "The news is given on contract - it's supari news… planted news. We will never compromise the self-respect of Maharashtra," Raut said.He said MVA partners have resolved seat-sharing in over 210 constituencies and that the remaining ones would be sorted out soon. MPCC chief Nana Patole said the party has prepared a list of its 96 seats where candidates will be declared soon. "The BJP is trying to create confusion in the MVA but they will not allow this to happen. The BJP is afraid of losing elections. That's why they are spreading the rumors," Patole said.

**What's at stake**

Congress and Shiv Sena (UBT) leaders say they have unanimity on 210 seats and that the rest 78 will be sorted out soon. However, these are the seats where Congress has so far refused to compromise

## Khela In Jharkhand? Several BJP Leaders Join JMM Ahead Of Polls; Saffron Party Reacts

Days after the BJP announced 66 candidates for the Jharkhand assembly elections leaving only two seats of its quota out of 81 seats open, several BJP leaders including three former MLAs joined the ruling Jharkhand Mukti Morcha (JMM). The former MLAs were Lois Marandi, Kunal Sarangi and Lakshman Tudu. This comes two days after three-term BJP MLA Kedar Hazra and AJSU Party leader Umakant Rajak joined the JMM. AJSU is contesting the Jharkhand polls in alliance with the BJP.Sarangi had in July resigned from the party's primary membership. Sarangi had also expressed disappointment with the party leadership's indifferent approach despite his efforts to highlight crucial issues. Sarangi had represented the Baharagora seat while Lois Marandi had defeated Chief Minister Hemant Soren from Dumka in 2014. According to reports, Lois Marandi had written to BJP state president Babulal Marandi drawing his attention to the 'neglect' of dedicated workers like her and rising factionalism in BJP.Lakshman Tudu in 2014 had defeated JMM's Ramdas Soren from Ghatshila constituency by a margin of 6,403 votes. Others who came to JMM-fold include BJP leaders from Seraikela -- Ganesh Mahli, Basco Besra and Bari Murmu, reported PTI.

**Boost For JMM**

Joining of former MLAs is being seen as a booster for the ruling JMM which is facing anti-incumbency in the state. This will give the JMM multiple candidate options from respective assembly seats. Most of these leaders command a fare support among voters and it may benefit the JMM.

**BJP Reacts**

The Jharkhand BJP spokesperson Pratul Shah Deo brushed aside the news of party leaders joining the JMM. Deo described them as 'dejected and rejected' individuals seeking opportunities elsewhere. "These dejected and rejected people are joining (other parties), those who did not get tickets in the BJP. There are crores of workers in the BJP, and only a few of them get the opportunity to contest elections. Some of them were fortunate to have been MLAs at one point in time or have contested elec-



tions. They were given an opportunity by the party; still, if such ungrateful people are going to other parties, then it means it is more important for them to be MLAs. They have forgotten that the BJP can develop this state," Deo said.

**Jharkhand Voting, Result Dates**

Elections for the 81-member Jharkhand assembly will take place in two phases, on November 13 and November 20, with vote counting set for November 23. The filing of nomination papers for the 43 constituencies voting in the first phase started on Monday, with three nominations submitted so far. A total of 2.60 crore eligible voters will participate in the assembly elections.

## "If They Want To Risk...": Supreme Court's Bulldozer Action Warning To UP

Hearing a challenge to demolition notices served in Uttar Pradesh's Bahraich after a communal clash, the Supreme Court today indirectly warned the Yogi Adityanath government against any bulldozer action.The court said it is the state government's "choice" if it wants to risk violating the top court's directions. The court, however, noted that its orders in the 'bulldozer justice' case specify that it will not intervene if the structures facing demolition are illegal.The bench of Justice BR Gavai and Justice KV Viswanathan has asked the Uttar Pradesh government not to take any action before the next hearing tomorrow. Appearing for the petitioners, Senior Advocate CU Singh told the bench that local authorities issued demolition notices after the October 13 violence -- which claimed one life -- and asked them to respond within three days."Applicant No.1's father and brothers surrendered... notices purportedly issued on 17 Oct, but pasted on 18th evening... we sought hearing on Sunday, but that did not happen. Some have approached HC," Mr Singh said.Earlier, the Allahabad High Court extended to 15 days the deadline to file replies to the demolition notices and directed the state authorities to decide after considering the responses. Additional Solicitor General KM Nataraj, appearing



for the Uttar Pradesh government, assured the court that no action would be taken till tomorrow."If they (UP authorities) want to take the risk of flouting our order, it's their choice," Justice Gavai said today. Justice Viswanathan added that the high court had given 15 days to file replies to the demolition notices. Mr Singh, however, said the petitioners have not been granted any protection. The Supreme Court is currently hearing a bunch of petitions against 'bulldozer justice' - a term used to refer to the practice of razing the property of individuals accused in criminal cases. The trend has caught on in several states, Uttar Pradesh among them. The court has clarified that being accused of a crime cannot be the basis for the demolition of property and only violation of civic rules may attract such action. The court has also paused demolitions carried out without its permission.

**What Happened In Bahraich**

On October 13, an altercation broke out in Bahraich's Maharajganj when a group of people objected to loud music near a mosque during a procession for Durga Puja idol immersion. This snowballed into arson and vandalism in the area, forcing the local administration to snap Internet connectivity. Ram Gopal Mishra, 22, was shot dead during the clash. A video that circulated after the clash showed Mishra removing a green flag from a rooftop and replacing it with a saffron flag.Police have arrested five persons suspected to be involved in Mishra's death -- Mohammad Faheen, Mohammad Sarfaraz, Abdul Hameed, Mohammad Taleem alias Sabloo, and Mohammad Afzal. Mohammad Talim and Mohammad Sarfaraz were arrested after they suffered gunshots in an encounter with Uttar Pradesh police. Police said the accused were trying to cross into Nepal when they were caught.A total of 104 people have been arrested in connection with the violence and 23 establishments have been served demolition notices. Among those who were served notices is Hameed, one of the accused in the killing. Authorities, however, claim the notices were issued as part of a routine anti-encroachment drive. The notices have sparked panic among local residents as shopkeepers were seen vacating their premises.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

రాయల్ స్పోర్ట్స్




రాయల్ సినిమా

# కామన్వెల్త్ క్రీడల నుంచి హాకీ, క్రికెట్, బ్యాడ్మింటన్ ఔట్



గ్లాస్గోలో జరిగే కామన్వెల్త్ క్రీడల నుంచి హాకీ, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, స్క్వాష్, షూటింగ్, నెట్ బాల్, రోడ్ రేసింగ్‌ను తొలగించారు. ఈ మేరకు కామన్వెల్త్ క్రీడల సమాఖ్య ప్రకటన చేసింది. 2022 క్రీడల్లో (బర్మింగ్‌హామ్) 19 ఈవెంట్‌లను నిర్వహించారు. అయితే, ఖర్చులను తగ్గించుకోవడానికి ఈ సారి 10 ఈవెంట్‌లను మాత్రమే నిర్వహించాలని నిర్ణయించారు. నాలుగేళ్లకొసారి జరిగే కామన్వెల్త్ క్రీడలు 2026లో స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరంలో జరగనున్నాయి. వచ్చే ఏడాది జులై 23 నుంచి ఆగస్టు 2 వరకు ఈ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. ఈ నిర్ణయం భారత్‌కు ఒకరకంగా ఇబ్బందికరమే. ఎందుకంటే హాకీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, క్రికెట్, షూటింగ్‌లో భారత్‌కు పతకాలు వచ్చే ఛాన్స్ ఉండేది. ఇప్పుడు ఆ క్రీడాంశాలను తొలగించడంతో వాటి సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశముంది. 2022 కామన్వెల్త్ క్రీడల్లో భారత్ మొత్తం 61 పతకాలతో నాలుగో స్థానంలో నిలిచింది. ఇందులో 22 స్వర్ణాలు, 16 రజతాలు, 23 కాంస్యాలున్నాయి. రెజ్లింగ్‌లో అత్యధికంగా 12 పతకాలు రాగా.. వెయిట్ లిఫ్టింగ్‌లో 10 వచ్చాయి. వాస్తవానికి వచ్చే కామన్వెల్త్ క్రీడలు ఆస్ట్రేలియాలోని విక్టోరియాలో జరగాల్సింది. కానీ ఖర్చులు పెరగడంతో విక్టోరియా ఆతిథ్య హక్కులను వదులుకుంది. దీంతో టోర్నీ నిర్వహణకు స్కాట్లాండ్ ముందుకొచ్చింది.

# పృథ్వీ షాకు షాక్ ఇచ్చిన ముంబయి..

## అధిక బరువు, క్రమశిక్షణ లోపించడమే కారణమా?



ప్రతిభావంతుడైన యువ క్రికెటర్ పృథ్వీ షా చేజేతులా తన కెరీర్‌ను నాశనం చేసుకుంటున్నాడు. తనతో కలిసి ఆడిన క్రికెటర్లు అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తుంటే 24 ఏళ్ల పృథ్వీ షా మాత్రం ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటూ ఆటపై దృష్టి పెట్టలేకపోతున్నాడు. ఇప్పటికే భారత జట్టుకు దూరమైన అతడు.. తాజాగా రంజీ ట్రోఫీ జట్టులోనూ స్థానం కోల్పోయాడు. ముంబయి రంజీ టీమ్‌లోకి పృథ్వీ షాను ఎంపిక చేయలేదు. అతడిని పక్కనపెట్టడానికి ముంబయి క్రికెట్ అసోసియేషన్ స్పష్టమైన కారణం చెప్పలేదు. కానీ.. ఫిట్‌నెస్, క్రమశిక్షణారాహిత్యం వల్లే షాపై వేటు వేసినట్లు తెలుస్తోంది. నెట్ సెషన్స్‌కు అతడు ఆలస్యంగా రావడంతోపాటు అప్పుడప్పుడు డుమ్మా కొడుతున్నాడట. ఒక వేళ పాల్గొన్నా.. వాటిని సీరియస్‌గా తీసుకోవట్లేదని సమాచారం. అతడి ఫిట్‌నెస్ కూడా అంతంత మాత్రంగానే ఉంది. పృథ్వీ షా అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నాడట. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న ముంబయి క్రికెట్ అసోసియేషన్ సెలక్టర్లు అతడిపై క్రమశిక్షణాచర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారట. పృథ్వీని జట్టు నుంచి తప్పించాలనే నిర్ణయం కేవలం మేనేజ్‌మెంట్, సెలక్టర్లు తీసుకున్నది కాదట. కెప్టెన్, కోచ్ కూడా దీనిని సమర్థించినట్లు సమాచారం. కేవలం 18 ఏళ్ల వయసులోనే భారత జట్టు తరపున టెస్టు కెరీర్ ఆరంభించిన పృథ్వీ షా తొలి మ్యాచ్‌లోనే సెంచరీ కొట్టి అబ్బురపరిచాడు. అంత గొప్పగా కెరీర్‌ను ఆరంభించిన కుర్రాడు.. ఇప్పుడు టీమ్‌ఇండియా ఛాయల్లోనే లేడు. ప్రతిభకు లోటు లేని ఇతడిలో.. క్రమశిక్షణ కొరవడి, ఫిట్‌నెస్ లేక చేజేతులా కెరీర్‌ను దెబ్బ తీసుకుంటున్నాడు. టీమ్‌ఇండియా తరపున అతడు చివరగా 2021 జులైలో శ్రీలంకతో టీ20 మ్యాచ్ ఆడాడు.

# భారత్‌తో రెండో టెస్టుకూ కేన్ విలియమ్సన్ దూరం

భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు అక్టోబర్ 24 నుంచి ప్రారంభంకానుంది. పుణె వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌కు ముందు కివీస్‌కు గట్టి షాక్ తగిలింది. రెండో టెస్టు మ్యాచ్‌కూ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ అందుబాటులో ఉండట్లేదు. శ్రీలంకతో టెస్టు సిరీస్ సమయంలో కేన్‌కు గజ్జల్లో గాయమైంది. దాని నుంచి కోలుకుంటాడని భావించి భారత్ సిరీస్‌కు ఎంపిక చేశారు. కానీ, జట్టుతో కలిసి అతడు భారత్‌కు రాలేదు. స్వదేశంలోనే చికిత్స పొందుతున్నాడు. పూర్తిగా రికవరీ కాకపోవడంతో తొలి టెస్టులోనూ ఆడలేదు.. ఇప్పుడు రెండో టెస్టుకూ దూరమయ్యాడు. "కేన్ విలియమ్సన్ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. వేగంగా కోలుకుంటున్నాడు. ఇంకా వంద శాతం ఫిట్‌గా మాత్రం లేడు. మరికొన్ని రోజుల్లో మూడో టెస్టుకు అందుబాటులోకి రావచ్చని ఆశిస్తున్నాం" అని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు తెలిపింది. మూడు టెస్టుల సిరీస్‌లో న్యూజిలాండ్ 1-0 ఆధిక్యంలో ఉంది. బెంగళూరు టెస్టులో విజయం సాధించి మంచి ఊపుమీదున్న కివీస్.. రెండో టెస్టులోనూ అదే జోరు కొనసాగించేలా ప్రణాళికలు రచిస్తోంది. న్యూజిలాండ్ దూకుడుకు కళ్లెం వేసి మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని టీమ్‌ఇండియా భావిస్తోంది.

# నాని రెమ్యునరేషన్ మళ్లీ పెరిగిందా?




నేచురల్ స్టార్ నాని బ్యాక్ టు బ్యాక్ సక్సెస్ లతో జోరు మీద ఉన్నాడు. 'దసరా', 'హాయ్ నాన్న', 'సరిపోదా శనివారం' సినిమాలతో హ్యాట్రిక్ హిట్స్ తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం తన సొంత ప్రొడక్షన్ లో శైలేష్ కొలను దర్శకత్వంలో 'హిట్ 3' మూవీ చేస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఏకంగా 100 కోట్ల బడ్జెట్ తో ఈ మూవీ తెరకెక్కుతూ ఉండటం విశేషం. పాన్ ఇండియా రేంజ్ లో నాని కెరియర్ లోనే అత్యధిక బడ్జెట్ మూవీ గా ఈ చిత్రం సిద్ధమవుతోంది. ఈ మూవీలో నాని పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా కనిపించబోతున్నారు. దీని తర్వాత శ్రీకాంత్ ఒదేల దర్శకత్వంలో రెండో సినిమాని నాని చేయబోతున్నారు. వచ్చే ఏడాది ఆరంభంలో మూవీ మొదలయ్యే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. దీని తర్వాత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ చిత్రం చేయనున్నట్లు టాప్ నడుస్తోంది. ఇలా వరుస సినిమాలతో నాని ఫుల్ బిజీగా ఉన్నాడు. ఇదిలా ఉంటే వరుస విజయాలతో నాని మార్కెట్ రేంజ్ కూడా జరిగింది. ప్రస్తుతం 60 నుంచి 80 కోట్ల మధ్యలో ఆయనపై బిజినెస్ నడుస్తోంది. దీంతోపాటు డిజిటల్ మార్కెట్ కూడా నాని సినిమాలకు గణనీయంగా పెరిగింది మంచి ప్రీమియం ధరలకు నాని సినిమాలను ఓటీటీ ఛానల్స్ కొనుగోలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో నానితో సినిమాలు చేయడానికి చాలామంది ప్రొడ్యూసర్స్ ముందుకొస్తున్నారు. పెరిగిన మార్కెట్ నేపథ్యంలో నాని తాజాగా తన రెమ్యూనరేషన్ పెంచినట్లు టాక్ వినిపిస్తోంది. 'హిట్ 3' తర్వాత చేయబోయే సినిమాలకి నాని 35 కోట్ల రెమ్యూనరేషన్ గా తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన చూసుకుంటే ప్రస్తుతం టైర్ టు హీరోలలో అత్యధిక రెమ్యూనరేషన్ తీసుకుంటున్న స్టార్ గా నాని ఉన్నాడు. నిర్మాతలు కూడా నాని డిమాండ్ చేసిన రెమ్యూనరేషన్ ఇవ్వడానికి సిద్ధంగానే ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలను వినిపిస్తోంది. హిట్ 3 మూవీ ఫ్యాన్ ఇండియా స్థాయిలో సక్సెస్ అందుకుంటే నాని టైర్ వన్ హీరోల జాబితాలోకి వెళ్లిపోయే అవకాశాలు ఉన్నాయి. నిర్మాతలు కూడా 100 నుంచి 150 కోట్ల వరకు బడ్జెట్ పెట్టడానికి వెనుకాడకపోవచ్చని అనుకుంటున్నారు. అప్పుడు నాని రెమ్యునరేషన్ మరింతగా పెంచే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

# 'ఖలేజా' దిలావర్ వైఫ్.. సడన్ ట్రెండింగ్!




సోషల్ మీడియా అనే సాధనం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎంతో మంది అమ్మాయిలు బిగ్ సెలెబ్రిటీలుగా మారిపోయారు. అదే సమయంలో కొన్ని సినిమాల్లో మెరిసి.. ఆ తర్వాత కనిపించకుండా వెళ్లిపోయిన చాలా మంది నటీమణులు కూడా వెలుగులోకి వచ్చి యమా హైలైట్ అయిపోయారు. అలా ఇప్పుడు ఇంటర్నెట్‌లో ఎంతో మంది సెన్సేషన్ అవుతున్నారు. అలాంటి వారిలో ప్రముఖ నటి దివ్య మేరీ సిరియాక్ ఒకరు. దివ్య మేరీ సిరియాక్ అంటే ఎవరు అనేది మీరు గుర్తు పట్టకపోవచ్చు. కానీ, 'ఖలేజా' సినిమాలో దిలావర్ సింగ్ భార్యగా నటించిన అమ్మాయి అని తెలిస్తే ఇట్టే పట్టేస్తారు. దీనికి కారణం ఈ అమ్మడు కనిపించింది కాసేపే అయినా ఈ చిత్రంలో బాగా హైలైట్ అయింది. మహేష్ చెక్ ఇవ్వడానికి వచ్చినప్పుడు ఆమె రొట్టెలు చేస్తూ రెండు ఫ్రేమ్ లలో కనిపిస్తుంది. కేవలం ఆమె ఫేస్ మాత్రమే కనిపిస్తుంది. అయినా కూడా ఆమె హోమ్లీ లుక్ కి ఇప్పుడు సోషల్ మీడియా జనాలు ఎట్రాక్ట్ అవుతున్నారు అయితే, ఆ తర్వాత మాత్రం దివ్య మేరీ సిరియాక్ మరో మూవీలో సందడి చేయలేదు. దీంతో చాలా మంది ఈమె అంటూ ఒకరు ఉన్నారు అన్నదే మర్చిపోయారు. కారణం ఏమిటో తెలియదు కానీ ఈ మధ్య కాలంలో మాత్రం దివ్య మేరీ సిరియాక్ గురించి సోషల్ మీడియాలో చాలా మంది వెతకడం మొదలు పెట్టారు. 'ఖలేజా' సినిమాలో ఆమె కనిపించిన గెటప్ ఫొటోలను షేర్ చేస్తూ ఇంటర్నెట్‌లో జల్లెడ పట్టారు. ఫలితంగా ఆమె పేరును ట్రెండింగ్‌లో పెట్టేశారు. అలా వెతికి ఇలా వెతికి చివరికి దివ్య మేరీ సిరియాక్‌ను కొందరు ఔత్సాహిక నెటిజన్లు మాత్రం సోషల్ మీడియాలో ఇటీవలే గుర్తించారు. 'ఖలేజా' సినిమాలో దిలావర్ సింగ్ భార్యగా నటించిన దివ్య మేరీ సిరియాక్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను చూసిన వాళ్లంతా యమా షాక్ అవుతున్నారు. దీనికి కారణం ఈ అమ్మడు అప్పుడు కనిపించిన దానికి ఇప్పుడు ఉన్న దానికి అస్సలు పోలికలే లేనట్లుగా ఉండడమే. అంతలా దివ్య మేరీ సిరియాక్ ఏజ్ పెరిగినా తనదైన అందంతో కట్టిపడేస్తోంది. మొత్తానికి చాలా రోజుల తర్వాత కనిపించిన ఈ భామ ఇప్పుడు ఓ రేంజ్‌లో హైలైట్ అవుతోంది. ఇక, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో మహేశ్ బాబు నటించిన చిత్రమే 'ఖలేజా'. ఇందులో హీరో పాత్ర దిలావర్ సింగ్ అ వ్యక్తిని వెతుక్కుంటూ రాజస్థాన్ చేరుకుంటుంది. ఆ సమయంలో అతడి భార్యగా దివ్య మేరీ సిరియాక్ కనిపిస్తుంది. ఆమె మహా అంటే రెండు మూడు ఫ్రేమ్స్‌లో మాత్రమే ఉంటుంది. కానీ, ప్రేక్షకుల చూపులు లాగేసుకుంది. అలాంటి ఈ అమ్మడు చాలా రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది.

# దేవర.. ఈమె జాన్వీ కంటే అందంగా..



సాధారణంగా ఏ సినిమాలో అయినా హీరోల తర్వాత హీరోయిన్లే బాగా అందంగా కనిపిస్తూ ఉంటారు. కానీ, కొన్ని కొన్ని సినిమాల్లో మాత్రం ఫీమేల్ లీడ్స్ కంటే అందులో నటించిన క్యారెక్టర్ ఆర్టిస్టులు బాగా హైలైట్ అవుతుంటారు. మరికొన్ని చిత్రాల్లో మాత్రం హీరోయిన్లతో సమానంగా ప్రత్యేక ఆకర్షణ అవుతుంటారు. ఇప్పుడు అలా అయిన వారిలో 'దేవర' సినిమాలో నటించిన శృతి మరాఠే ఒకరు. యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ తెరకెక్కించిన చిత్రమే 'దేవర'. ఫుల్ లెంగ్త్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ చిత్రం అద్భుతమైన స్పందనను అందుకుని సత్తా చాటుకుంది. ఫలితంగా కోట్ల వసూళ్లను సాధించి సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. ఇందులో ఎన్టీఆర్ డుయల్ రోల్‌లో నటించగా.. అతడికి జంటగా జాన్వీ కపూర్‌తో పాటు శృతి మరాఠే అని కూడా నటించింది. 'దేవర' చిత్రంలో తండ్రిగా నటించిన జూనియర్ ఎన్టీఆర్‌కు శృతి మరాఠే భార్యగా నటించింది. ఇందులో ఆమె ఎంతో డీసెంట్‌గా కనిపించినప్పటికీ.. నందమూరి అభిమానులతో పాటు సినీ ప్రియులను ఫిదా చేసేసింది. ఒకవైపు జాన్వీ కపూర్ తనదైన అందాల ఆరబోతతో హైలైట్ అవగా.. శృతి మరాఠే మాత్రం అచ్చ తెలుగు భామలా పద్ధతైన చీరకట్టులోనే కనికట్టు చేసింది. మరీ ముఖ్యంగా కొన్ని సన్నివేశాల్లో అద్భుతమైన నటన, హావభావాలతో మాయ చేసింది. దీంతో అసలు ఈ అమ్మడు ఎవరు అని చాలా మంది ఇంటర్నెట్ వేదికగా వెతుకులాట ప్రారంభించారు. శృతి మరాఠే గుజరాత్‌కు చెందిన నటి. ఆమె 'సనాయి చౌగదే' అనే మరాఠి సినిమాతో నటిగా ప్రయాణాన్ని మొదలు పెట్టింది. ఆ తర్వాత హిందీ, కన్నడం, గుజరాతీ, తమిళ భాషల్లో చాలా చిత్రాల్లో నటించింది. ఈ క్రమంలోనే ప్రముఖ సీరియల్ హీరో గౌరవ్ ఘట్నేకర్‌కు వివాహం చేసుకుంది. అలాగే, చాలా సీరియళ్లలో సైతం నటించి ఫేమస్ అయింది. ఇప్పుడు ఈ చిన్నదే 'దేవర' చిత్రంతో టాలీవుడ్‌లోనూ తనదైన మార్కును చూపించింది. 38 ఏళ్ల శృతి మరాఠే వరసగా సినిమాలు చేస్తూనే సోషల్ మీడియాలోనూ ఓ రేంజ్‌లో యాక్టివ్‌గా ఉంటోంది. ఇందులో తనదైన అందచందాలతో నెటిజన్లను మాయ చేసేస్తోంది. మరీ ముఖ్యంగా అప్పుడప్పుడూ గ్లామరస్ ఫొటోలు, వీడియోలను కూడా షేర్ చేస్తోంది. ఇలా ఈ మధ్య కాలంలో రెచ్చిపోయి రచ్చ చేస్తోంది. దీనికితోడు 'దేవర' వంటి పాన్ ఇండియా చిత్రం ద్వారా ఇప్పుడు శృతి మరాఠే దేశ వ్యాప్తంగా ట్రెండింగ్‌లో నిలుస్తోంది.

# తారక్ స్థాయిని పెంచే యాక్షన్ ఘట్టం



టాలీవుడ్‌లో సుదీర్ఘ కాలంగా మినిమమ్ హిట్టు కొడుతూ సత్తా చాటుతోన్న హీరో యంగ్ టైగర్ ఎన్టీఆర్. అప్పుడెప్పుడో వచ్చిన 'టెంపర్' నుంచి ఇటీవల విడుదలైన 'దేవర' వరకూ ఏకధాటిగా మంచి విజయాలను అందుకున్న అతడు.. పాన్ ఇండియా స్టార్‌గా మారడంతో పాటు తన మార్కెట్‌ను భారీగా పెంచుకున్నాడు. ఈ జోష్‌లోనే మరిన్ని సినిమాలను చేయడానికి రెడీ అవుతున్నాడు. బీభత్సమైన ఫామ్‌తో దూసుకెళ్తోన్న జూనియర్ ఎన్టీఆర్.. ఇప్పుడు బాలీవుడ్‌లో నేరుగా 'వార్ 2' అనే సినిమాలో నటిస్తున్నాడు. ఇందులో అతడు స్టార్ హీరో హృతిక్ రోషన్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నాడు. స్పై యూనివర్స్ నుంచి వచ్చి సక్సెస్ అయిన 'వార్' మూవీకి ఇది సీక్వెల్‌గా రాబోతుంది. అయాన్ ముఖర్జీ రూపొందిస్తోన్న ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలోనే ఉన్నాయని చెప్పాలి. ఇండియాలోనే బడా స్టార్లుగా వెలుగొందుతోన్న ఇద్దరు హీరోలు కలిసి నటిస్తోన్న 'వార్ 2' మూవీకి సంబంధించిన ప్రధానమైన షూటింగ్‌ను కొద్ది రోజుల క్రితమే మొదలు పెట్టేశారు. హృతిక్ రోషన్ గతంలోనే ఈ సినిమా షూట్‌లో పాల్గొనగా.. ఎన్టీఆర్ ఇటీవలే ఓ షెడ్యూల్ పూర్తి చేసుకున్నాడు. అంతేకాదు, మళ్లీ చిత్రీకరణ కోసం రెండు రోజుల క్రితమే ముంబై నగరానికి చేరుకున్నాడు. 'వార్ 2' సినిమాకు సంబంధించిన షూటింగ్ నేటి నుంచి అంధేరిలో స్టార్ట్ కానుంది. యశ్ రాజ్ స్టూడియోలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెట్‌లో స్పెషల్ సీన్స్ షూట్ చేయనున్నారు. ఇందులో జూనియర్ ఎన్టీఆర్‌పై ఓ క్రేజీ యాక్షన్ సీక్వెన్స్‌ను షూట్ చేస్తున్నట్లు తాజాగా తెలిసింది. ఈ ఫైట్ సీన్‌లో అతడు ఏకంగా 40 మందితో ఫైటింగ్ చేస్తున్నాడట. ఇందుకోసం హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ వర్క్ చేస్తున్నట్లు సమాచారం. ఫుల్ లెంగ్త్ యాక్షన్ జోనర్‌లో రూపొందుతోన్న 'వార్ 2' మూవీలో ఇప్పుడు జరుగుతున్న ఫైట్ సీన్ హైలైట్‌గా ఉండబోతుందట. ఇది ఎన్టీఆర్ క్యారెక్టర్‌ను హై రేంజ్‌కు తీసుకు వెళ్లేలా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఇందుకోసం అయాన్ ముఖర్జీ స్పెషల్ గా ప్లాన్ చేశాడని అంటున్నారు. మొత్తానికి 'వార్ 2'తో ఎన్టీఆర్ ఇండియన్ సూపర్ స్టార్‌గా మరింత ఎత్తుకు ఎదగడం ఖాయం అనిపిస్తోంది. ఇక, ఎన్టీఆర్ - హృతిక్ కాంబోలో రాబోతున్న 'వార్ 2' మూవీని యశ్ రాజ్ ఫిల్మ్స్ సంస్థ దాదాపు రూ. 300 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తోంది. స్పై థ్రిల్లర్ జోనర్‌లో రాబోతున్న ఈ చిత్రంలో ఆలియా భట్, కియారా అద్వాణీ హీరోయిన్లుగా నటిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రీతమ్ మ్యూజిక్ కంపోజ్ చేస్తున్నాడు.

# సినిమాలో తప్పులు చూపిస్తే పార్టీ ఇస్తా

దుల్కర్ సల్మాన్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన 'లక్కీ భాస్కర్' మూవీ అక్టోబర్ 31న పాన్ ఇండియా రేంజ్ లో ఐదు భాషలలో రిలీజ్ కాబోతోంది. పీరియాడికల్ డ్రామాగా వస్తోన్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటించింది. ఇదిలా ఉంటే తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ అయ్యింది. ట్రైలర్ ఇంప్రెసివ్ గా అనిపించింది. ఇంటరెస్టింగ్ డ్రామాతో ఈ మూవీ కథాశం ఉండబోతోందని అనిపిస్తోంది. ఇదిలా ఉంటే ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో నిర్మాత నాగవంశీ పాల్గొన్నారు. ఇందులో ఆయన ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'లక్కీ భాస్కర్' మూవీలో అస్సలు చిన్న మిస్టేక్స్ కూడా ఎంచలేరని అన్నారు. ఎవరైనా మూవీలో పొరపాట్లు ఫైండ్ అవుట్ చేసి చెబితే వారికి పెద్ద పార్టీ ఇస్తానని ఛాలెంజ్ చేశారు. ఈ మూవీ విషయంలో చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నామని అన్నారు. సినిమా చూసిన తర్వాత ఎవరైనా తప్పులని చూపించగలిగితే కచ్చితంగా వారికి పార్టీ ఇవ్వడంతో పాటు ప్రత్యేకంగా ఫోటోలు కూడా దిగుతానని నాగవంశీ కాన్ఫిడెంట్ గా చెప్పారు. గతంలో 'మ్యాడ్' మూవీ విషయంలో కూడా నిర్మాత నాగవంశీ ఇలాంటి ఛాలెంజ్ చేశారు. 'మ్యాడ్' మూవీ చూసిన తర్వాత ఎవరైనా నచ్చలేదు అంటే డబ్బు వాపస్ ఇస్తానని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరు కచ్చితంగా నవ్వుతారని అన్నారు. ఆయన ఛాలెంజ్ చేసినట్లుగానే సినిమాకి సూపర్ హిట్ టాక్ వచ్చింది. ఇప్పుడు 'లక్కీ భాస్కర్' మూవీ విషయంలో కూడా నాగవంశీ మరోసారి ఛాలెంజ్ చేయడం విశేషం. ఆయన ఛాలెంజ్ ని జర్నలిస్టులు అలాగే ఆడియన్స్ స్వీకరించి తప్పులని ఎత్తి చూపిస్తారా లేదా అనేది చూడాలి. ఇదిలా ఉంటే సీతారామం తర్వాత దుల్కర్ సల్మాన్ తెలుగులో చేస్తోన్న సినిమా ఇదే కావడంతో అందరికి మూవీ పైన ప్రత్యేక ఆసక్తి ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY CHALLA SRIKANTH, PRINTED AT SRINIVASA PRINTERS D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA WEST,(U) VILLAGE, BAPATLA -522101, GUNTUR DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA -522101 GUNTUR DISTRICT, ANDHRA PRADESH,
EDITOR : CHALLA SRIKANTH, RNI : APBIL / 2023 / 86665, CELL: 6281086394 , emil srikanth9550389070@gmail.com